ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 21.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 271 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

నేడే అండర్ 19 ఆసియా కప్ ఫైనల్ 8



ఎవరి మతాన్ని వారు ఆచరిస్తూనే ఇతర మతాలను గౌరవించాలని సీఎం సూచంచారు. మత ప్రాతిపదికన దాడులు చేయాలని చూసినవారిని, అలాంటి ఘటనలను ప్రభుత్వం అణచివేసిందని చెప్పకొచ్చారు. ఇతర మతాలను కించపరిస్తే శిక్షించే విధంగా శాసన సభలో చట్టం తెస్తామని సీఎం ప్రకటించారు. ఎవరైనా ఇతర మతాలను కించపరిచేలా మాట్లాడితే శిక్షించేలా చట్టాన్ని సవరిస్తామని తెలిపారు. అన్ని మతాలకు సమాన గౌరవాన్ని కల్పిస్తామని, మైనారిటీలకు అందించే సంక్షేమం ఎవరి దయ కాదని, అది వారి హక్కు అని సీఎం తెలిపారు. క్రిస్టియన్, ముస్లిం శ్మశాన వాటికల సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

ప్రేమను పంచాలి శాంతిని పెంచాలి

మానవాళికి ఏసుక్రీస్తు సందేశమిదే

డిసెంబర్‌నెల మిరాకిల్‌మంత్..

- తెలంగాణ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి కూడా
- ప్రజా ప్రభుత్వం ఏర్పడిందీ డిసెంబర్లోనే
- ప్రభువు బోధనల స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది
- తెలంగాణను నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతాం
- ఇతర మతాలను కించపరిస్తే సహించం
- వారిని శిక్షించే విధంగా చట్టం తెస్తాం
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఎల్బీస్టేడియంలో ఘనంగా క్రిస్మస్‌విందు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్20 : ప్రేమను పంచి, శాంతిని పెంచాలని ఏసుక్రీస్తు చాటారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎల్బీస్టేడియంలో క్రిస్మస్ సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వేషించే వారిని సైతం ప్రేమించాలని మానవాళికి ఏసుక్రీస్తు సందేశం ఇచ్చారన్నారు. ఏసుక్రీస్తు జన్మించిన డిసెంబర్ నెల మిరాకిల్ మంత్ అని తెలిపారు. డిసెంబర్ నెల క్రీస్తు ఆరాధకులకు మాత్రమే కాదు, తెలంగాణ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి కూడా ఒక మిరాకిల్ మంత్ అని సీఎం తెలిపారు. కాంగ్రెస్ అధినేత్రి, తెలంగాణ ప్రదాత సోనియా గాంధీ పుట్టింది డిసెంబర్ నెలలోనే అని, తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నెల కూడా డిసెంబరే అని అన్నారు. ప్రభువు బోధనల స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, ఎవరు ఎన్ని విధాలుగా ఇబ్బంది పెట్టినా, దుష్ప్రచారం చేసినా, రాష్ట్రంలో శాంతిని కాపాడుతూ సంక్షేమ

...:: మిగతా 2లో

దేశ నిర్మాణంలో పీఎస్సీలది కీలక పాత్ర

- వికసిత్ భారత్ లక్ష్యానికి సివిల్ సర్వీసుల నాణ్యతే నిర్ణాయకం
- ప్రతిభ కేవలం నిలబెట్టడమే కాదు, అది కనిపించాలి
- 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యం
- ఉపాధి అవకాశాలపై కమిషన్లు దృష్టి పెట్టాలి
- ఉప రాష్ట్రపతి సీపీ. రాధాకృష్ణన్
- పబ్లిక్‌సర్వీస్‌కమిషనర్ల జాతీయ సదస్సు ముగింపు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్20: దేశ పాలనా వ్యవస్థల నాణ్యత, సమగ్రత, సామర్థ్యాలను తీర్చిదిద్దడంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పాత్ర అత్యంత కీలకమని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిలింసిటీలో నిర్వహించిన పబ్లిక్‌సర్వీస్ కమిషన్ల చైర్మన్ల జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పాల్గొని ప్రసంగించారు. ఈ ముగింపు సమావేశంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ భారత్ 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యంతో ముందుకు సాగుతున్న వేళ, పాలనా నాణ్యతతో పాటు సంస్థలను నడిపించే వ్యక్తుల నాణ్యత కూడా అత్యంత ముఖ్యమని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. సమర్థులు, నిష్పక్షపాతులు, నైతిక విలువలు కలిగిన వ్యక్తులను ఎంపిక చేయడం అనే కీలక బాధ్యత రాజ్యాంగబద్ధంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు అప్పగించబడిందని తెలిపారు. రాజ్యాంగంలో పొందుపరిచిన స్వతంత్రత కారణంగానే పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ప్రతిభ, న్యాయం,

...:: మిగతా 2లో

రేవంత్‌తో ప్రజలు 'ఫుట్‌బాల్' ఆడుకోవడం ఖాయం

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం చేసింది

- ఢిల్లీ బీజేపీ నేతలతో రేవంత్ ఒప్పందాలు
- తెలంగాణ కాంగ్రెస్ వారికి 'ఏటీఎం'గా మారింది
- కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇచ్చిన గడువు ముగిసింది
- ఇకపై నేరుగా ప్రజల్లోకి కేసీఆర్
- బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 21: కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డి పాలన, రాజకీయ విలువలపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో శనివారం మీడియా ప్రతినిధులతో జరిగిన సుదీర్ఘ చిట్ చాట్ లో రాజకీయ ఫిరాయింపులు, బీసీ రిజర్వేషన్లు, కాంగ్రెస్, బీజేపీ అంతర్గత ఒప్పందాలు మరియు రాష్ట్ర అభివృద్ధి కుంటుపడటం వంటి అంశాలపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

రాజకీయాల్లో సంస్కారం ముఖ్యం

రాజకీయాల్లో సంస్కారం ముఖ్యం అని కేటీఆర్ స్పష్టం చేశారు. "రేవంత్ రెడ్డి ఇంట్లోని మహిళలు, పిల్లలు లేదా ఆయన మనమడి గురించి నేను మాట్లాడను. రేవంత్ రెడ్డి మాదిరి కుటుంబ సభ్యుల విషయంలో నేను చిల్లర రాజకీయాలు చేయను" అని ఆయన

...:: మిగతా 2లో

పీఎస్సీలు దేశ పాలనా వ్యవస్థకు వెన్నుముకలు

- పరీక్షల నిర్వహణలో వార్షిక క్యాలండర్ తప్పని సరి
- టీపీపీఎస్సీ విజయవంతంగా జాబ్ క్యాలెండర్ నిర్వహిస్తోంది
- పారదర్శకతే పబ్లిక్ సర్వీస్ కమిషన్ కు ప్రాణం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 20: పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దేశ పరిపాలనా వ్యవస్థకు వెన్నెముకలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. న్యాయమైన, పారదర్శకమైన, సమగ్ర నియామక విధానాల ద్వారానే ప్రజా సేవలో ప్రతిభకు సరైన స్థానం దక్కుతుందని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో వార్షిక క్యాలెండర్ తప్పనిసరిగా ఉండాలని, దానికి కట్టుబడి వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ పబ్లిక్ సర్వీస్ కమీషనర్ల ముగింపు సదస్సలో భట్టి మాట్లాడుతూ పరీక్షల్లో జాప్యం వల్ల యువతలో నిరాశ పెరుగుతోందని, అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ముందస్తు ప్రణాళికతో పరీక్షలు నిర్వహించాల్సిన బాధ్యత కమిషన్లపై ఉందన్నారు. వార్షిక క్యాలెండర్ అమలు చేయడం ద్వారా వ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విజయవంతంగా జాబ్ క్యాలెండర్ నిర్వహిస్తోంది కమిషన్ చైర్మన్ , సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం పక్షాన అభినదిస్తున్నామని అన్నారు. పారదర్శకతే పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ప్రాణమని ఆయన అన్నారు. ప్రశ్నాపత్రాల తయారీ నుంచి

...:: మిగతా 2లో

ఫోన్‌ట్యాపింగ్‌పై విచారణ వేగవంతం

ఫోన్‌ట్యాపింగ్‌కేసు విచారణను సర్కారు వేగవంతం చేసింది. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తాజాగా కొత్త ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు శనివారం నుంచి కీలక విచారణను ప్రారంభించారు.

...:: వివరాలు 3లో

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు

ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, వారి తల్లిదండ్రుల సమస్యలకు పరిష్కారం చూపాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. నెల రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే తాను నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు.

...:: వివరాలు 2లో

'సర్'తో చొరబాటు దారుల ఏరివేత

ఎన్నికల ప్రక్రియలో చొరబాటుదారులను దూరంగా ఉంచేందుకే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ను ఎన్నికల కమిషన్ చేపట్టిందని ప్రధాని మోదీ చెప్పారు. చొరబాటుదారులను కాపాడేందుకు కొందరు ద్రోహులు ప్రయత్నిస్తున్నారని తప్పపట్టారు.

7

ఇమ్రాన్ ఖాన్ దంపతులకు 17 యేండ్ల జైలు

పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అతని భార్య బుష్రా బీబీలకు తొషఖానా - 2 అవినీతి కేసులో ఫెడరల్ ఇన్వేస్టిగేషన్ ఏజెన్సీ ప్రత్యేక కోర్టు ఇమ్రాన్ ఖాన్ దంపతులకు 17 ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ శనివారం తీర్పునిచ్చింది.

7

'ఉపాధి' పథకంపై మోడీ బుల్డోజర్

ఉపాధి హామీ పథకమైన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ తీవ్ర ఆక్షేపణ తెలిపారు. ఉపాధి హామీ పథకంపై బుల్డోజర్ నడిపారని ఆరోపించారు.

7

పిలిస్తే మేం ఇద్దరం వెళ్తాం

అధికార మార్పిడి అంశంపై కర్ణాటక సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య అంతరం పెరుగుతోందంటూ ఊహాగానాలు వెలువడుతున్న నేపథ్యంలో డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

7

ప్రేమను పంచాలి.. శాంతిని పెంచాలి

మొదటిపేజీ తరువాయి

పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అందిస్తున్నామని, 50 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత కరెంట్ అందించి పేదల కుటుంబాల్లో వెలుగులు నింపామని తెలిపారు. ఆనాడు ఆహార భద్రత చట్టం తీసుకువచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఇవాళ రాష్ట్రంలో 3 కోట్ల 10 లక్షల మంది పేదలకు సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. పేదలను మా కుటుంబ సభ్యులుగా భావించి వారికి సన్న బియ్యం అందిస్తున్నామని, రుణమాఫీ చేసి సన్న వడ్లకు 500 బోనస్ అందించి వ్యవసాయాన్ని పండగ చేశామని వివరించారు. ఆనాడు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. క్రిస్టియన్ మిషనరీలు విద్య, వైద్యాన్ని ప్రాధాన్యతగా తీసుకుని పేదలకు అందించాయన్నారు. ఒక యుద్ధంలా, యజ్ఞంలా అంకితభావంతో ప్రభుత్వంతో పోటీ పడి పేదలకు విద్య, వైద్యాన్ని అందించాయని కొనియాడారు.

ఇతర మతాలను గౌరవించాలి

ఎవరి మతాన్ని వారు ఆచరిస్తూనే ఇతర మతాలను గౌరవించాలని సీఎం సూచించారు. మత ప్రాతిపదికన దాడులు చేయాలని చూసినవారిని, అలాంటి ఘటనలను ప్రభుత్వం అణచివేసిందని చెప్పుకొచ్చారు. ఇతర మతాలను కించపరిస్తే శిక్షించే విధంగా శాసన సభలో చట్టం తెస్తామని సీఎం ప్రకటించారు. ఎవరైనా ఇతర మతాలను కించపరిచేలా మాట్లాడితే శిక్షించేలా చట్టాన్ని సవరిస్తామని తెలిపారు. అన్ని మతాలకు సమాన గౌరవాన్ని కల్పిస్తామని, మైనారిటీలకు అందించే సంక్షేమం ఎవరి దయ కాదని, అది వారి హక్కు అని సీఎం తెలిపారు. క్రిస్టియన్, ముస్లిం శ్మశాన వాటికల సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. తెలంగాణ రైసింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ కు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళతామని, అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు, క్రిస్టియన్ మత పెద్దలు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో పీఎస్సీలది కీలక పాత్ర

మొదటిపేజీ తరువాయి

పారదర్శకతలను కాపాడగలుగుతున్నాయని ఉపరాష్ట్రపతి అన్నారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో కమిషన్లు పరిపాలనా నిరంతరత, సంస్థాగత స్థిరత్వం, నిష్పక్షపాత నియామకాల ద్వారా ప్రజల విశ్వాసాన్ని బలపరిచాయని గుర్తు చేశారు. డిజిటల్ గవర్నెన్స్, సామాజిక సమగ్రత, మౌలిక వసతుల అభివృద్ధి, వాతావరణ మార్పు చర్యలు, ఆర్థిక రూపాంతరం వంటి జాతీయ ప్రాధాన్యాల అమలు నేటి రోజున ఎంపికయ్యే అధికారుల నాణ్యతపై ఆధారపడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ నియామకాలలో నిష్పక్షపాతతే నైతిక పునాది అని, పక్షపాతాన్ని తొలగించేందుకు పారదర్శక విధానాలు, గోప్య మూల్యాంకనం, ఆబ్జెక్టివ్ మార్కింగ్ వ్యవస్థలు తప్పనిసరిగా ఉండాలని ఉపరాష్ట్రపతి సూచించారు. చిన్నపాటి అవకతవకలు కూడా సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయగలవని హెచ్చరిస్తూ, ప్రజా పరీక్షల్లో అక్రమాలకు జీరో టాలరెన్స్ ఉండాలని నాధా కృష్ణన్ పిలుపునిచ్చారు. నేటి పాలనకు అకడమిక్ అర్హతలతో పాటు నైతిక విచక్షణ, భావోద్వేగ మేధస్సు, నాయకత్వ లక్షణాలు, జట్టు సమన్వయం అవసరమని ఉపరాష్ట్రపతి అన్నారు. కేవలం నియామకాలతోనే జీవితకాల ఉత్తమ సేవలు సాధ్యం కాదని పేర్కొంటూ, పనితీరు మదింపు, విజిలెన్స్ పర్యవేక్షణ, కాలానుగుణ సమీక్షలు పారదర్శకంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తిత్వం, నైతిక ప్రవర్తనే దేశ నిర్మాణానికి, ప్రజా విశ్వాసానికి పునాది అని ఆయన స్పష్టం చేశారు. భారత్ జనాభా ప్రయోజనాన్ని ప్రస్తావిస్తూ, సరైన ప్రతిభను సరైన బాధ్యతలతో అనుసంధానించేందుకు 'ప్రతిభా సేతు' వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా టాలెంట్ మ్యాపింగ్, ఉపాధి అవకాశాలపై కమిషన్లు దృష్టి పెట్టాలని ఉపరాష్ట్రపతి సూచించారు. సదస్సు మంచి పాలనకు పునాదులను మరింత బలోపేతం చేస్తూ, వికసిత్ మరియు ఆత్మనిర్భర్ భారత్ దిశగా దేశ ప్రయాణంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు కీలక పాత్ర పోషిస్తాయని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

పీఎస్సీలు దేశ పాలనా వ్యవస్థకు వెన్నుముకలు

మొదటిపేజీ తరువాయి

తుది ఎంపిక వరకు ప్రతి దశ స్పష్టంగా, సందేహాలకు తావులేకుండా ఉండాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించి రియల్‌టైమ్ సమాచారం అందించాలన్నారు. ప్రజల విశ్వాసాన్ని పొందడమే కమిషన్ల ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రశ్నాపత్రాల లీకేజ్‌లు ప్రజాసేవ విలువలకు విరుద్ధమని, ఇవి అభ్యర్థుల కలలను చిదిమేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. లీకేజీలను అడ్డుకునేందుకు ఆధునిక భద్రతా వ్యవస్థలు అమలు చేయాలని, సిబ్బందికి నైతిక విలువలపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. తప్పిదాలు చోటుచేసుకుంటే వేగంగా, నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్వ్యూ లు కేవలం జ్ఞాన పరీక్షలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వం, నైతికత, నిర్ణయ సామర్థ్యాన్ని అంచనా వేసేలా ఉండాలని సూచించారు. పక్షపాతానికి తావులేకుండా, న్యాయంగా ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. విభిన్న నేపథ్యాల నిపుణులతో ఇంటర్వ్యూ బోర్డులు ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల అమలులో కమిషన్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. రిజర్వేషన్లు కేవలం సంఖ్యలకే పరిమితం కాకుండా వాస్తవికంగా ఫలితాలు ఇచ్చేలా చూడాలన్నారు. అర్హులైన అభ్యర్థులు అవకాశాలు పొందేలా కోచింగ్, సడలింపులు, పర్యవేక్షణ వ్యవస్థలు ఉండాలని సూచించారు. నియామక ప్రక్రియల్లో న్యాయపరమైన వివాదాలు తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. స్పష్టమైన నిబంధనలు, ముందస్తు సమాచారం ఇవ్వడం ద్వారా లిటిగేషన్‌ను తగ్గించవచ్చని చెప్పారు. కోర్టుల తీర్పుల నుంచి పాఠాలు నేర్చుకొని వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థలని, రాజకీయ ప్రభావాలకు లోనుకాకుండా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. స్వతంత్రతను సద్వినియోగం చేసుకొని సంస్కరణలకు నాయకత్వం వహించాలని సూచించారు. విశ్వాసాన్ని పునర్నిర్మించి, ప్రతిభకు సమానత్వంతో అవకాశం కల్పిస్తూ, పబ్లిక్ సర్వీస్ కమిషన్లను నిజాయితీకి ప్రతీకగా నిలపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు మనం ఎంపిక చేసే అధికారులపై ఆధారపడి ఉందని, కాబట్టి నియామకాలు న్యాయంగా, పారదర్శకంగా జరగాలని భట్టి విక్రమార్క మల్లు అన్నారు.

పాల్గొన్న 24 రాష్ట్రాల పీఎస్సీ చైర్మన్లు

సదస్సు రెండో రోజున యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా (రిటైర్డ్), డాక్టర్ దినేష్ దాసా, అలాగే 24 రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఛైర్మన్లు పాల్గొన్నారు. రెండో రోజు సదస్సులో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సామాన్య సవాళ్లు, నియామక ప్రక్రియలపై ప్రభావం చూపుతున్న న్యాయ సంబంధిత అంశాలపై విస్తృతంగా చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీపీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశం పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు సంబంధించిన ఆర్థిక వికేంద్రీకరణ, నిధుల ప్రవాహ వ్యవస్థలపై సమగ్ర ప్రెజెంటేషన్ ఇచ్చారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరఫున 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు భావనను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా టీజీపీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశం మాట్లాడుతూ, ముగింపు సమావేశానికి ఉపరాష్ట్రపతి హాజరు కావడం సదస్సులో పాల్గొన్న కమిషన్లకు గొప్ప ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని ఇచ్చిందని తెలిపారు.

ఇంధన పరిరక్షణ, నెట్ కార్బన్ జీరో లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది. కొత్త భవనాలకు ప్లాన్ శాంక్షన్ కావాలంటే తప్పనిసరిగా ఎనర్జీ ఎఫీషియెంట్ ఎక్విప్‌మెంట్ వాడాలనే నిబంధనను తీసుకువచ్చాం. ప్రతి గ్రామంలో సోలార్ రూఫ్ ఏర్పాటును ప్రోత్సహించేలా గ్రీన్ ఎనర్జీ పాలసీ పెట్టాం. ఇంధన పొదుపుపై అవగాహనకు స్కూళ్లలో ఎనర్జీ లిటరసీ క్లబ్స్ నెలకొల్పాం.

\- ఏపీ సీఎస్ విజయానంద్

ప్రజలు కాంగ్రెస్‌తోనే ఉన్నారు

- తెలంగాణ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కన్వీనర్ మల్లు రవి

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 20: తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారని, ఇది స్థానిక ఎన్నికల ఫలితాలతో నిరూపితమైందని తెలంగాణ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) కన్వీనర్ డా.మల్లు రవి అన్నారు. తెలంగాణలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల ఫలితాల గురించి ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీకి వివరించినట్లు మల్లు రవి తెలిపారు. మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీతో శనివారం సమావేశమైనట్లు తెలిపారు. తెలంగాణలో మొత్తం 12,702 పంచాయతీలకి ఎన్నికలు జరిగాయని, 8,335 పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు కైవసం చేసుకున్నారని వివరించానని తెలిపారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని, ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కేటీఆర్, హరీష్ రావు, కిషన్ రెడ్డి, ఇతర నాయకులు చేస్తున్న విమర్శలను ప్రజలు పట్టించుకోలేదని వివరించానన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు

ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

- స్పందించకపోతే నిరాహార దీక్ష
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 21: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, వారి తల్లిదండ్రుల సమస్యలకు పరిష్కారం చూపాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. నెల రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే తాను నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. శనివారం బోయిన్‌పల్లి మనోవికాస్ నగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవరమెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజబులిటీస్ (ఎన్ఐఈపీఐడీ)లో శిక్షణ పొందుతున్న ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు, వారి తల్లిదండ్రులతో కల్వకుంట్ల కవిత సమావేశమయ్యారు. ఇటీవల జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా ఎన్ఐఈపీఐడీని ఆమె సందర్శించారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను కవిత అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులు, మానసికంగా, శారీరకంగా సవాళ్లు ఎదుర్కొంటున్న పిల్లల కుటుంబాలకు పెన్షన్‌తో పాటు అన్ని ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఆమె హామీ ఇచ్చారు. నెల రోజులలో ప్రభుత్వం స్పందించకపోతే తాను నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, మానసిక ఎదుగుదల తక్కువగా ఉన్న పిల్లలకు ఇప్పటివరకు ఏ ప్రభుత్వం సరైన న్యాయం చేయలేదన్నారు. పార్లమెంట్‌లో పోరాటం చేసి 21 రకాల సమస్యలు ఉన్న వారిని దివ్యాంగులుగా గుర్తింపజేశామని తెలిపారు. తెలంగాణలో దివ్యాంగుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం కల్పించేలా తానే పోరాటం చేసి జీవో తీసుకొచ్చినప్పటికీ, అది సక్రమంగా అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మానసికంగా సవాళ్లు ఉన్న పిల్లల తల్లిదండ్రులకు ఇళ్లు అద్దెకు కూడా దొరకని పరిస్థితి ఉందని, అందుకే వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న వారు లక్ష మంది వరకు ఉన్నారని, వారందరికీ పెన్షన్ ఇవ్వగలిగే స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ప్రతి ప్రభుత్వ పథకంలో మానసిక, శారీరక వైకల్యం ఉన్న పిల్లల తల్లిదండ్రులకు, అలాగే భర్తను కోల్పోయిన మహిళలు, ఒంటరి మహిళలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కవిత సూచించారు. దివ్యాంగులు, మెంటల్లీ ఛాలెంజ్ పిల్లల సమస్యలపై నిరంతరం పోరాటం చేయడానికి తెలంగాణ జాగృతిలో ప్రత్యేక డిసబులిటీ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందుగా ప్రభుత్వానికి నెల రోజుల గడువు ఇస్తామని, ఆ తర్వాత కూడా స్పందన లేకపోతే పెన్షన్లు, ఇళ్లు మంజూరు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు.

రేవంత్‌తో ప్రజలు 'ఫుట్‌బాల్' ఆడుకోవడం ఖాయం

మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేశారు. రాజకీయ పోరాటం కేవలం నేతల మధ్యే ఉండాలని, అస్సాం సీఎం రాహుల్ గాంధీ పుట్టుకను ప్రశ్నించినప్పుడు కూడా కేసీఆర్ ఖండించారని, అది తమ సంస్కృతి అని గుర్తు చేశారు. రాజకీయాల్లోకి కుటుంబ సభ్యులను లాగడం ఏనాడూ చేయలేదని కేటీఆర్ చెప్పారు. రాజకీయంగా మాత్రం రేవంత్ రెడ్డిని వదిలిపెట్టేది లేదన్నారు. రేవంత్ రెడ్డి ఎవరితో ఫుట్ బాల్ ఆడినా తనకు సంబంధం లేదని, ఆయనతో ప్రజలు 'ఫుట్ బాల్' ఆడుకోవడం ఖాయం అని హెచ్చరించారు.

బీసీ రిజర్వేషన్ల విషయంలో పచ్చి మోసం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. అందుకే 23% ఉన్న రిజర్వేషన్లను పంచాయతీ ఎన్నికల్లో 17 శాతానికి తగ్గించిందని మండిపడ్డారు. అసలు బిసిలను మోసం చేసినందుకు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ బిసిలకు క్షమాపణ చెప్పాలి. బీసీలకు సీట్లు ఇచ్చే అంశంలో కాంగ్రెస్ నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన పరిస్థితి తమ పార్టీకి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ 42 శాతానికి మించి, అన్ని సందర్భాల్లో బీసీలకు సరైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన పార్టీ మాది అని కేటీఆర్ తెలిపారు.

కాంగ్రెస్ - బీజేపీల మధ్య 'చీకటి స్నేహం'

కాంగ్రెస్, బీజేపీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని కేటీఆర్ ఆరోపించారు. ఢిల్లీలో బీజేపీ ఎంపీ దూబే గృహప్రవేశానికి రేవంత్ రెడ్డి ఎందుకు వెళ్లారో బీజేపీ నాయకుడు రామచంద్రరావు చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ తుగ్లక్ రోడ్‌లో రేవంత్ రెడ్డి నివాసాన్ని రీమోడల్ చేయించింది ఒక బీజేపీ ఎంపీయేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రమేష్ వంటి వారికి రేవంత్ రెడ్డి కాంట్రాక్టులు ఇస్తుంటే, బీజేపీ ఆయనకు అండగా నిలుస్తోందని ఆరోపించారు. తెలంగాణ కాంగ్రెస్ ఏటీఎంగా మారిందని, ఇక్కడ 'ఆర్ఆర్ ట్యాక్స్' నడుస్తోందని సాక్షాత్తు ప్రధాని, హోంమంత్రి అన్నా కూడా బీజేపీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై రాజీనామా సవాల్

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "అభివృద్ధి కోసం పార్టీ మారామని ఎమ్మెల్యేలు మైకుల్లో బహిరంగంగా చెబుతున్నారు. కాంగ్రెస్ ఆఫీసులో కూర్చుని మేము బీఆర్ఎస్‌లోనే ఉన్నామనడం పెద్ద కామెడీ" అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి, ఉప ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు.

ఉపాధి హామీ పథకం సవరణపై మండిపడిన కెటిఆర్

ఉపాధి హామీకి చేసిన సవరణల వలన గ్రామీణ పేదలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఉపాధి హామీ చట్టానికి పేరు మార్పిడిపై గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలోనూ అదే ధోరణి కొనసాగిస్తున్నదన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి రాజీవ్ గాంధీ పేరు పెట్టింది కాంగ్రెస్ పార్టీయేనని, పేర్ల మార్పిడి మాత్రమే కాకుండా తెలంగాణ తల్లిని కూడా మార్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు చేస్తున్న విమర్శలపైన ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. మరోవైపు భారతీయ జనతా పార్టీ ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును తీసివేయడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. బీజేపీ పేరు మార్పు మాత్రమే కాకుండా, ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచేలా అనేక నిబంధనలు ఉంచిందని, ఈ అంశాన్ని తమ పార్టీ తరఫున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు.

ఇకపై కేసీఆర్ నేరుగా ప్రజల్లోకి..

కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న 'హనీమూన్ పీరియడ్' ముగిసిందని, ఇకపై కేసీఆర్ నేరుగా ప్రజల్లోకి వస్తారని కేటీఆర్ ప్రకటించారు. రేపు జరిగే రాష్ట్ర స్థాయి సమావేశంలో కేసీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణపైన రేపటి సమావేశంలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత భారీ ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతామన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మున్సిపాలిటీల విలీనం సక్రమంగా జరగలేదని, గ్రేటర్ ను మూడు కార్పొరేషన్లు చేయాలనేది రేవంత్ రెడ్డి ఆలోచన అని కేటీఆర్ విమర్శించారు. చిన్న మున్సిపాలిటీలను పెద్ద మున్సిపాలిటీలు లేదా కార్పొరేషన్లలో కలిపే అంశంపై స్థానిక ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదన్నారు. మరోవైపు వార్డుల విభజన కూడా అశాస్త్రీయంగా, అడ్డగోలుగా జరిగిందన్నారు.

బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయం

2028లో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని, రేవంత్ రెడ్డి పాలనకు పంచాయతీ ఎన్నికల ఫలితాలే సూచిక అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు సమయం కోసం వేచి చూస్తున్నారని, రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హవా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను చూసిన తర్వాత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు పోవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాహసించడం లేదని కేటీఆర్ అన్నారు. అందుకే వెంటనే పెట్టాలనుకున్న ఎన్నికలను సుదీర్ఘంగా వాయిదా వేసుకుంటున్నట్లు పరోక్షంగా ముఖ్యమంత్రి చెప్పిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. పంచాయతీ ఎన్నికల్లో తాము గెలుచుకున్న స్థానాల సంఖ్యను పెంచుకునేందుకు.. కాంగ్రెస్ రెబల్స్ ని, ఇండిపెండెంట్లను కూడా తమ అభ్యర్థులుగా చూపించుకుని జాబితా విడుదల చేశారని ఎద్దేవా చేశారు. మరోవైపు బీఆర్ఎస్ సాధించిన స్థానాలను తక్కువగా చూపించి సంతోషపడ్డారన్నారు.

వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలపై కౌంటర్

తాను వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాత అనేక స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించానని, రేవంత్ రెడ్డి తన సొంత పార్లమెంట్ స్థానాన్ని కూడా గెలిపించుకోలేకపోయారని గుర్తు చేశారు. తాను వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాతే పార్టీ ఓడిపోయిందన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జరిగిన దాదాపు అన్ని ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోవడమే కాకుండా, మూడు చోట్ల డిపాజిట్లు కోల్పోయారని ఎద్దేవా చేశారు.

బిహార్ సీఎం నితీష్‌రాజీనామా చేయాలి

- మహిళల గౌరవం, రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించారు
- హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఖాలిద్ సైపుల్లా
- చార్మినార్‌వద్ద కాంగ్రెస్ కార్యకర్తల నిరసన

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 20: బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ వెంటనే ప్రజల ముందు క్షమాపణ చెప్పి, పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఖాలిద్ సైపుల్లా నేతృత్వంలో వందలాది కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం చారిత్రక చార్మినార్ సమీపంలో భారీ నిరసన చేపట్టారు. పట్నాలో జరిగిన ఒక ప్రజా కార్యక్రమంలో ఒక మహిళా డాక్టర్ హిజాబ్‌ను ముఖ్యమంత్రి లాగి తొలగించిన ఘటనకు నిరసనగా ఈ ఆందోళన జరిగింది. ఈ చర్య మహిళ గౌరవం, శరీర స్వేచ్ఛ మరియు రాజ్యాంగ హక్కులపై తీవ్రమైన ఉల్లంఘన అని నిరసనకారులు పేర్కొన్నారు. కఠిన చర్యలు తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. నిరసన సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఖాలిద్ సైపుల్లా, కేవలం క్షమాపణ సరిపోదని, బాధ్యత నిర్ధారించేందుకు నితీష్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. వీడియోలో రికార్డ్ అయి విస్తృతంగా ప్రసారమైన ఈ ఘటన దేశ అంతఃకరణను కుదిపేసిందని, దీనిని తేలికగా పక్కన పెట్టలేమని అన్నారు. ప్రజల ముందే జరిగిన శారీరక దాడిగా దీనిని అభివర్ణిస్తూ, హోదా లేదా అధికారం ఎంత ఉన్నా, అనుమతి లేకుండా ఏ మహిళను తాకే హక్కు ఎవరికీ లేదని, ఆమె దుస్తులపై జోక్యం చేసుకునే అధికారం ఎవరికీ లేదని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ను ప్రస్తావిస్తూ, జీవితం మరియు వ్యక్తిగత స్వేచ్ఛ హక్కులో గోప్యత, గౌరవం, దుస్తుల ఎంపిక స్వేచ్ఛ కూడా భాగమేనని ఖాలిద్ చెప్పారు. ఒక ముఖ్యమంత్రి ప్రజల ముందే మహిళను అవమానించడం సమాజానికి ప్రమాదకరమైన సందేశాన్ని పంపుతుందని, మహిళల శరీరాలు మరియు ఎంపికలు తీర్పు లేదా జోక్యానికి లోబడి ఉన్నాయన్న భావనను పెంచుతుందని అన్నారు. జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) 1990 చట్టం ప్రకారం స్వయంచాలకంగా (సువో మోటో) చర్యలు తీసుకునే అధికారమున్నప్పటికీ ఈ విషయంలో మౌనం వహించడాన్ని ఖాలిద్ తీవ్రంగా విమర్శించారు. చిన్న ఘటనల్లోనూ జోక్యం చేసుకున్న కమిషన్, పదవిలో ఉన్న ముఖ్యమంత్రికి సంబంధించిన కేసులో చర్యలు తీసుకోకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందని అన్నారు. హోదా ఎంత ఉన్నా చట్టం అందరికీ సమానమని, ఎన్‌సీడబ్ల్యూ వెంటనే నోటీసు జారీ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో భాగంగా, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు 8826777445 అనే టోల్‌ఫ్రీ మిస్డ్ కాల్ నంబర్‌ను ప్రారంభిస్తున్నట్లు హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు ప్రకటించారు. మిస్డ్ కాల్ ఇస్తే జాతీయ మహిళా కమిషన్‌కు నితీష్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ నేరుగా ఈమెయిల్స్ పంపే లింక్ అందుతుందని తెలిపారు. కమిషన్ స్పందించే వరకు వేలాది, ఆపై లక్షల సంఖ్యలో ఈమెయిల్స్ పంపే బల్క్ ఈమెయిల్ ప్రచారాన్ని కాంగ్రెస్ చేపడుతుందని అన్నారు. ఈ నిరసనలో ప్రొఫెషనల్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, యువ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. షైలేందర్, నవిక, అష్ఫాక్ ఖాన్, ఉజ్మా షాకిర్, మమత నాగి రెడ్డి తదితరులు, అలాగే అసెంబ్లీ ఇన్‌చార్జ్‌లు నాగేష్, రాజేష్ హాజరయ్యారు.

రాజకీయం

రోడ్డు ప్రమాదాల తగ్గుదలపై సర్కారు దృష్టి

- జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాన్ని విజయవంతం చేయాలి
- రోడ్డు నిబంధనలపై అవగాహన సదస్సులు నిర్వహించాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ రామకృష్ణారావు
- జిల్లా కలెక్టర్లతో విడియో కాన్ఫరెన్స్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్20: జనవరిలో జరిగే జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో తీసుకోవాల్సిన కార్యాచరణ పై సచివాలయంలో సీఎస్ రామకృష్ణారావుతో కలసి మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్లతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గత ఏడాది రాష్ట్రంలో 25,934 రోడ్డు ప్రమాదాలు జరగగా ,7949 మరణాలు జరిగాయని ప్రమాదాలకు ప్రధాన కారణం రోడ్డు నిబంధనలు ఉల్లంఘించి రాష్ డ్రైవింగ్, డ్రైవర్ నిరక్ష్యం వల్లే జరిగినట్లు గుర్తించామని మంత్రి పొన్నం ప్రభాకర్‌తెలిపారు. ప్రమాదాలను నివారించడానికి రోడ్డు నిబంధనల విషయంలో కఠినంగా వ్యవహరిస్తూ రోడ్డు నిబంధనలపై ప్రజలకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్స వాలపై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. రోడ్డు సేఫ్టీ పై ప్రతి జిల్లాలో ఏర్పడిన రోడ్ సేఫ్టీ కమిటీ లు ఈ నెలాఖరులోపు సమావేశాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ లకు సూచించారు. ప్రతి జిల్లాలో రోడ్ భద్రతా ఫోర్స్ వాలంటీర్ బృందాలను ఏర్పాటు చేసి అన్ని గ్రామాల్లో, పాఠశాలల్లో అధికారులతో కలిసి అవగాహన కల్పించాలని ఆదేశించారు. యూనిసెఫ్ సహకారంతో విద్యార్థులకు ట్రాఫిక్ అవేర్నెస్ పై పాఠ్యాంశాలు చేర్చడం జరుగుతుందని తెలిపారు.

విస్తృతస్థాయిలో అవగాహణ..

చీఫ్ సెక్రెటరీ రామకృష్ణ రావు మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి కింది స్థాయి నుండి రాజధాని వరకు విస్తృత అవగాహన ద్వారానే మరణాల రేటు తగ్గించవచ్చని సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ఓవర్ లోడ్ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఇటీవల ప్రమాదాలకు ప్రమాద కారణం ఓవర్ లోడ్ వల్లే అని సూచించారు. ప్రజల ఆస్తి, ప్రాణ నష్టాలను కాపాడే బాధ్యత మన అందరి పై ఉందని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జిల్లా కలెక్టర్లు, అడిషనల్ డీజీ లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఎంజేపి సెక్రటరీ సైదులు, నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులు, వివిధ సంక్షేమ శాఖ అధికారులు, రవాణా శాఖ అధికారులు, పోలీస్, ట్రాఫిక్, ఆర్ అండ్ బీ, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన సీఎం రేవంత్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 20: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం నాంపల్లి ప్రజాప్రతినిధుల స్పెషల్ కోర్టుకు వ్యక్తిగతంగా హాజరయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీ, తిరుమలగిరి, మట్టంపల్లి పోలీస్ స్టేషన్లలో గతంలో నమోదైన కేసుల విచారణకు ఆయన హాజరు కావడం విశేషం. ఈ మూడు కేసులు ప్రధానంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు, పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు లేదా రాజకీయ కార్యక్రమాల సందర్భంలో నమోదయినవి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఈ కేసులు నమోదయ్యాయి. కోర్టులో జడ్జి ముందు రేవంత్ రెడ్డి ఎగ్జామినేషన్ (ప్రశ్నోత్తరాలు) ప్రక్రియ పూర్తి చేశారు. మూడు కేసుల్లోనూ ఈ దశ పూర్తయిన నేపథ్యంలో తదుపరి విచారణ లేదా తీర్పు కోసం కోర్టు తేదీ నిర్ణయించనుంది. సీఎం హాజరుతో కోర్టు పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.మీడియా, సామాన్యులను కోర్టు హాల్ సమీపంలోకి అనుమతించలేదు. కాంగ్రెస్ నేతలు ఈ కేసులను రాజకీయ కుట్రతో మోపినవని విమర్శిస్తున్నారు.

ఫోన్‌ట్యాపింగ్‌పై విచారణ వేగవంతం

- ప్రభాకర్‌రావును విచారించిన సిట్‌అధికారులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్20: ఫోన్ ట్యాపింగ్‌కేసు విచారణను సర్కారు వేగవంతం చేసింది. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తాజాగా కొత్త ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు శనివారం నుంచి కీలక విచారణను ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రభాకర్ రావును పోలీసులు మళ్లీ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టారు. సీపీ సజ్జనార్ సూచనల మేరకు శనివారం ఉదయం నుంచే పలువురు సిట్ అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విచారణ ప్రారంభించారు. ఇప్పటికే ఈ కేసులో అరెస్టయిన ఇతర నిందితులను కూడా సిట్ అధికారులు పిలిపించి, ప్రభాకర్ రావు ఎదుటే ప్రశ్నించారు. గతంలో వారు ఇచ్చిన స్టేట్‌మెంట్లు, సాంకేతిక ఆధారాలు, డేటా విశ్లేషణ ఆధారంగా ప్రభాకర్ రావును సమగ్రంగా విచారిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పాత్ర పోషించిన వ్యక్తిగా భావిస్తున్న ప్రణీత్ రావుతో కలిపి కూడా ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నించనున్నారు. ఈ వారం రోజుల విచారణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కీలక నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు, మరికొందరి పాత్రపై స్పష్టత వచ్చే అవకాశం ఉండటంతో రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్‌సమర్పించిన సీఎం రేవంత్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్20: ఆజ్మీర్ షరీఫ్‌దర్గాకు రాష్ట్ర ప్రభుత్వం తరపునముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాదర్ను సమర్పించారు. శనివారం సచివాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా చాదర్‌ను సమర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు, మైనార్టీ గురుకుల సంస్థ వైస్ చైర్మన్ ఫహీం ఖురేషీ, తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ అఫ్జల్ బియాబని, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ముస్లిం మైనారిటీ నేతలు పాల్గొన్నారు.

హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు బిగ్ షాక్

- ఒకేసారి 80 మంది సిబ్బందిని బదిలీ చేసిన సజ్జనార్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 20: నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సీపీ సజ్జనార్ బిగ్ షాక్ ఇచ్చారు. ఒకేసారి 80 మంది సిబ్బందిని బదిలీ చేశారు. ఎస్ఐ నుంచి కానిస్టేబుల్ వరకు ర్యాంక్ అధికారులందరినీ అటాచ్ చేశారు. కొందరు అధికారులు టాస్క్‌ఫోర్స్ డిపార్ట్‌మెంట్ కొన్నేళ్లుగా పాతుకుపోయినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల కాలంలో టాస్క్‌ఫోర్స్ అధికారులపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఒక నిందితుడిని తప్పించినందుకు భారీగా డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే టాస్క్‌ఫోర్స్ విభాగంపై సీపీ స్పెషల్ ఫోకస్ పెట్టారని సమాచారం. టాస్క్‌ఫోర్స్ విభాగం ప్రక్షాళనకే సీపీ ఈ నిర్ణయం తీసుకున్నారని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

అసమానతలు రూపుమాపే ఆయుధం విద్య

- నైపుణ్యం, మానవ విలువలు ఉన్న విద్యను అందించడమే లక్ష్యం
- దీర్ఘకాల అభివృద్ధికి మానవ మూలధనం లోతైన పునాది
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- లయోలా విద్యాసంస్థల గోల్డెన్ జూబ్లీ వేడుకలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్20: సమాజంలో పాతుకుపోయిన అసమానతలను రూపుమాపమే ప్రధాన ఆయుధం విద్య మాత్రమేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన మేడ్చల్ జిల్లా అల్వాలలో లయోలా విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ నైపుణ్యం తోపాటు మానవ విలువలు కలిగిన విద్యను అందించడమే తమ లక్ష్యమని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇందులో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీలో స్కిల్ యూనివర్సిటీ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలోని 100 ఐటిఐలను అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని, వీటి ద్వారా రాష్ట్ర యువతకు ఉపాధితో పాటు రాష్ట్ర జీడీపీ పెరుగుదలకు ఉపయోగపడుతుందని డిప్యూటీ సీఎం వివరించారు. సామాజిక ఆసమానతలను రూపుమాపే లక్ష్యంతో అన్ని వర్గాల విద్యార్థులు ఒకే చోట ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో చదువుకునేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. సమాజంలోనీ వ్యవస్థలు, సంస్థల్లో మార్పు విద్య ద్వారానే సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సిపెక్(సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల) సర్వే ద్వారా మరింత స్పష్టమైనదని డిప్యూటీ సీఎం వివరించారు. సుదీర్ఘకాలం అభివృద్ధి, నాయకత్వం వహించాలంటే లోతైన మానవ మూల ధనమే పునాది అని అగ్రదేశాలను లోతుగా పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఒక లక్ష్యంతో నడిచే విద్య క్యాంపస్ గోడలను దాటి దీర్ఘకాల ప్రభావాన్ని చూపుతుందని లోయోలా అకాడమీ నిరూపిస్తోంది అన్ని డిప్యూటీ సీఎం తెలిపారు. కాలక్రమేణా విద్య వ్యక్తిగత లక్ష్యాల వైపు మళ్లిందని, ఈ రోజు యువత మంచి ఉద్యోగాలు, సివిల్ సర్వీసులు, విజయవంతమైన వ్యాపారాలను ఆశించడం సహజం, సమంజసం అని అన్నారు. కానీ ఎక్కడో ఒకచోట, ఒకప్పుడు యువ మనసులను కదిలించిన సామాజిక స్పృహ ప్రస్తుతం బలహీనపడింది అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు, మైనంపల్లి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఎవరితోనూ పొత్తు అవసరం లేదు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 20: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శనివారం మాట్లాడుతూ.. పసలేని, తెలివి తక్కువ వాళ్లు బీఆర్ఎస్‌తో బీజేపీకి పొత్తు ఉందని మాట్లాడుతారని మండిపడ్డారు. ఎవరితో బీజేపీ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై అడిగితే తప్పేంటి ప్రశ్నించారు. గతంలో సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితి పై కూడా అడిగారని గుర్తుచేశారు. పసలేని వాళ్లు తమ మీద ఆరోపణలు చేస్తే జవాబు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. రాజకీయ విమర్శలు మాని ప్రజలకు మేలు చేసే పనులు చేయాలని హితవుపలికారు. ఆదాయం వ్యక్తిగత అవసరాల కోసం జీహెచ్ఎంసీలో మునిసిపాలిటీలు , కార్పొరేషన్ల విలీనం చేశారని, దీనిపై మొదటి నుంచి బీజేపీ అభ్యంతరం చెబుతోందన్నారు.

బీజేపీలో చేరిన సీనియర్ నటి ఆమని

- ఆహ్వానించిన టీబీజేపీ చీఫ్‌రాంచందర్‌రావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్20: టాలీవుడ్ సీనియర్ నటి ఆమని రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. శనివారం ఆమె అధికారికంగా భారతీయ జనతా పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సమక్షంలో ఆమని బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాంచందర్ రావు ఆమెకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆమనీతో పాటు ప్రముఖ సినీ మేకప్ ఆర్టిస్ట్ శోభలత కూడా ఇదే వేదికపై కాషాయ గూటికి చేరారు. పార్టీలో చేరిన తర్వాత ఆమని మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా గర్వించదగ్గ స్థాయికి చేరుకుందని అన్నారు. భారతీయురాలిగా గర్వపడేలా చేసిన ఆయన అడుగుజాడల్లో నడవాలని నిర్ణయించుకున్నానని ఆమని తెలిపారు. మోదీ ప్రభుత్వం సనాతన ధర్మ పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని ఆమె పేర్కొన్నారు. పదవుల కోసం కాకుండా, కేవలం సామాన్య ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు స్పష్టం చేశారు. 1992లో 'జంబలకిడిపంబ' సినిమాతో సెన్సేషన్ క్రియేట్ చేసిన ఆమని, ఆ తర్వాత తెలుగు చిత్రసీమలో అగ్ర నటిగా ఎదిగారు. 'శుభలగ్నం', 'మావిచిగురు', 'శుభ సంకల్పం' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.

రేపు అరబిందో ఫార్మా లిమిటెడ్ యూనిట్–వన్‌లో మాక్ డ్రిల్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్20 : పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో చేపట్టాల్సిన తక్షణ చర్యలపై అవగాహనతో పాటు సన్నద్ధతను మరింత పెంపొందించేందుకు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ డి ఆర్ ఎఫ్) సహకారంతో ఈనెల 22న జిల్లాలో ప్రయోగాత్మకంగా నిర్వహించనున్న మాక్ డ్రిల్‌కు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లపై శనివారం సంబంధిత శాఖల అధికారులు, అరబిందో ఫార్మా లిమిటెడ్ యూనిట్ -వన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాక్ డ్రిల్ ప్రిపేర్డ్నెస్ ప్రణాళిక, ఆయా శాఖల బాధ్యతలు, అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే చేపట్టాల్సిన తక్షణ చర్యలు, సమన్వయం, సమాచార వ్యవస్థ, అత్యవసర సేవల నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. ఈ మాక్ డ్రిల్‌ను ఈనెల 22న హత్నూర మండలం బోరపట్ల గ్రామంలో గల అరబిందో ఫార్మా లిమిటెడ్, యూనిట్ -వన్ లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పరిశ్రమల్లో సంభవించే అగ్ని ప్రమాదాల సమయంలో ఎలా స్పందించాలి, ప్రాణనష్టం తగ్గించేందుకు ఏ చర్యలు తీసుకోవాలి, వివిధ శాఖల మధ్య సమన్వయం ఎలా ఉండాలి అనే అంశాలపై ఈ మాక్ డ్రిల్ ద్వారా ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మాక్ డ్రిల్‌ను పకడ్బందీగా, విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలని, అలాగే మాక్ డ్రిల్ నిర్వహణకు అరబిందో ఫార్మా లిమిటెడ్ యాజమాన్యం సహకరించాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావుకోరారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ తదితర శాఖల అధికారులు, అరబిందో ఫార్మా లిమిటెడ్ యూనిట్ -వన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

- పది రోజుల్లో అక్రిడిటేషన్ కార్డుల జీవో
- వచ్చే ఏడాది ఇళ్ల స్థలాల కేటాయింపు పై తీపి కబురు
- టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం, డిసెంబర్20 : జర్నలిస్టుల చిరకాల వాంఛలైన అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల అత్యవసరంగా హైదరాబాద్ వెళ్లాల్సి రావడంతో మంత్రి ఫోన్ ద్వారా జర్నలిస్టులను ఉద్దేశించి ప్రసంగించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకోబోయే కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా వివరించారు.

-త్వరలో అక్రిడిటేషన్ కార్డులు

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్న అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ తుది దశకు చేరుకుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాబోయే పది రోజుల్లోనే దీనికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.

ఇళ్ల స్థలాలపై స్పష్టత

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇప్పటికే లోతుగా చర్చించామని మంత్రి పేర్కొన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు, న్యాయపరమైన చిక్కుల వల్ల కొంత ఆలస్యమైందని అయితే వాటన్నింటినీ అధిగమించి వచ్చే ఏడాది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం తరపున తీపి కబురు అందిస్తామని ప్రకటించారు. జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని కాపాడటం తమ ప్రభుత్వ బాధ్యతని ఆయన ఉద్ఘాటించారు.

సమిష్టిగా ముందుకు సాగాలి

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించుకోవడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతున్న సంఘం నాయకులను, సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.



రంగురాళ్లపై బొమ్మలకోసం రూ. 700కోట్లు, రుషికొండకు గుండు కొట్టి ప్యాలెస్ కోసం రూ.500 కోట్లు దుర్వినియోగం చేశారు. ప్రజారోగ్యం కోసం యోగా డే నిర్వహిస్తే విష ప్రచారం చేస్తున్నారు. పీపీపీలో కాలేజీలు కడుతుంటే జైల్లో పెడతామంటున్నారు. ఇది వారి రాక్షసత్వానికి నిదర్శనం. అభివృద్ధికి అడ్డుపడుతున్నారు. అయినా వెనక్కు తగ్గేదే లేదు.

-ఏపీ సీఎం చంద్రబాబు

ప్రయోజనంలేని 'ఫిరాయింపుల చట్టం'

ఒక పార్టీలో గెలవడం, మరో పార్టీలో చేరడం. అక్కడ మంత్రి పదవి రాక పోతేనో, మరో కారణంతోనో మరో పార్టీలోకి మారడం. పార్టీ అధికారం కోల్పో తుందంటే అధికారం చేపట్టే పార్టీలో చేరడం వంటివి ఈ మధ్య కాలంలో తరచూ వింటున్నాం.. చూస్తున్నాం. వాస్తవానికి ప్రజాస్వామ్యానికి ప్రధాన మూల స్థంభ మైన రాజకీయాలను నెరపే ప్రజా ప్రతిని ధులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేయాలి. రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపులు సర్వసాధారణంగా మారాయి. ఒక పార్టీలో గెలిచి, మరొక పార్టీలోకి వెళ్లడాన్ని నిరోధించేందుకు చట్టం తెచ్చినా, ప్రయోజనమైతే కనిపించడం లేదు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న నేతల గోడదూకుళ్లకు అడ్డకట్ట పడాలంటే ఫిరాయింపుల నిషేధ చట్టాన్ని పటిష్టం చేయాలి. చాలా రాష్ట్రాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీలు మారిన ఉదంతాలు కోకొల్లలు. రాజ్యాంగంలోని పదో షెడ్యూలులో పొందుపరచిన ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని 1985లో తీసుకొచ్చారు. 1960ల్లో, 70ల్లో పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికైన సభ్యులు ఇష్టారీతిన పార్టీ ఫిరాయింపులకు పాల్పడేవారు. దాన్ని నిరోధించేందుకు ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. అయితే, చట్టం అమలులోకి వచ్చిన తరవాత కూడా దేశంలో పెద్దసంఖ్యలో ఫిరాయింపులు చోటుచేసుకున్నట్లు రాజ్యాంగం పనితీరును సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన జాతీయ కమిషన్ ఆక్షేపించింది. పదో షెడ్యూలు ఎందుకిలా అచేతనంగా మారిపోయిందనేది ప్రశ్నగానే మిగిలిపోయింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గోవా, మణిపూర్, మధ్యప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్. ఇలా అనేక రాష్ట్రాలలో ఫిరాయింపుల పేరిట ప్రజాప్రతినిధులు సులువుగా పార్టీలు మారుతున్నారు. మరి, ప్రజాతీర్పునకు, పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిని అనర్హులను చేయాలంటూ 38 ఏళ్ల కిందట తీసుకొచ్చిన ఫిరాయింపులు నిరోధక చట్టం ఏం చేస్తోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం స్వార్థ పూరిత రాజకీయాల చుట్టూనే ప్రజా ప్రతినిధులు తిరుగుతున్నారు. అటు రాజకీయ పార్టీల కు, ఇటు ప్రజా ప్రతినిధులకు నైతిక విలువలే లేని పరిస్థితి దాపురించింది. పార్టీలు ఫిరాయించడమనేది సర్వసాధారణమై పోయింది. ప్రస్తుతం కులాల కుంపట్లు రాజేస్తూ, మత విద్వేషాలను రెచ్చగొడుతూ, ఓటర్లను ప్రలోభ పెడుతూ నోట్ల కట్టల ద్వారా ధనవంతులే చట్ట సభల్లోకి ప్రవేశించగలుగుతున్నారు. పార్టీలు సైతం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఓ ప్రజాప్రతినిధిని గెలిపించుకోవడం కన్నా అందులోని సగం ఖర్చుతో ఫిరాయింపు ద్వారా తమ పార్టీలో కలుపుకోవడం సులభమనే కొత్త సిద్ధాంతం వెలుగు లోకి వచ్చింది. ఫిరాయింపులు జరిగినప్పుడు హార్స్ ట్రేడింగ్ ద్వారా ఎమ్మెల్యేలను అంగట్లో సరుకుల్లా కొనుగోలు చేస్తున్నారు. కానీ ప్రభుత్వాలు మాత్రం మా అభివృద్ధి కార్యక్రమాలతో ఆకర్షితులై మా ప్రభుత్వంలో చేరుతున్నారని బుకాయిస్తూ ఫిరా యింపులను ప్రోత్సహిస్తున్నాయి. ఇటు గెలిచిన ఎమ్మెల్యేలు సైతం అధికారంలో వున్న వారికే అన్ని అభివృద్ధి పథకాలు, ఆర్థిక వనరులు సమకూర్చుకునేందుకు అవకాశం ఉంటుందని.. రాజ్యాంగాన్ని విస్మరించి ఫిరాయింపుల ద్వారా అధికారానికి చేరువై స్వామి కార్యంతో పాటు కోట్లకు పడగెత్తాలనే తమ స్వకార్యం కూడా నెరవేరుతోందని భా విస్తున్నారు. ఫలితంగా ప్రతిపక్షమే లేని ప్ర భుత్వాలు కొనసాగుతున్నాయిచర్యల ఫలితంగా చట్టసభల లోపలా, బయటా ప్రజల సమగ్ర అభివృద్ధికి అవసరమైన పాలనా విధానాల రూపకల్పనపై అధికార, విపక్షాల మధ్య అర్థవంతమైన చర్చ జరగాలనే స్ఫూర్తి కొరవడి ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. తమను ఎన్నికల్లో గెలిపించిన పార్టీల పట్ల, సిద్ధాంతాల పట్ల కృతజ్ఞత లేకుండా అధికారం కోసం ప్యాకేజీల ఆకర్షణ వలలో పడి యధేచ్ఛగా పార్టీలు ఫిరాయిస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్న వైనం అత్యంత దురదృష్టకరం. ఇలా రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వాలనే కూల్చుతూ రాజకీయ అస్థిరతను సృష్టిస్తున్నారనే 1985లో యూపీఏ ప్రభుత్వం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని జారీ చేసింది. మళ్లీ 2003లో దానిని సవరించినా చట్టాల్లో ఉన్న లొసుగులను ఉపయోగించుకొని పార్టీమారిన ఉదంతాలను చూస్తున్నాం. ఇటీవలే ఎనిమిది రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చివేసిన సంఘటనలతో రాజకీయ విలువలు అధః పాతాళానికి చేరిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ చట్టాన్ని మరింత లోతుగా అధ్యయనం చేసి లొసుగులను సరిచేయాలనే వాదన క్రమేణా బలపడుతోంది. రాజీవ్‌గాంధీ ప్రభుత్వం పార్టీ ఫిరాయింపులను నియంత్రించే లక్ష్యంతో 1985లో 52వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా రాజ్యాంగానికి 10వ షెడ్యూల్‌ను చేర్చి, దానిలో 'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని' వివరించింది. దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను రక్షించి, బలోపేతం చేయడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశం. ఆర్టికల్స్ 101, 102 190, 191ల్లో పార్టీ ఫిరాయిం పుల నిరోధక చట్టం గురించి పేర్కొన్నారు. కానీ పదో షెడ్యూలు ముసాయిదాలోని లొసుగులే ఫిరాయింపులకు తావిస్తున్నాయి. ముఖ్యంగా మూకుమ్మడి ఫిరాయింపులకు అవి అవకాశమిస్తున్నాయి.

ప్రతిపక్షం
హైదరాబాద్,
ఆదివారం
21.12.2025

ఉపాధ్యాయులు ఉద్యోగులు కాదు.. సమాజ నిర్మాణ శిల్పులు

1944లో తూర్పు గోదావరి జిల్లా తాపేశ్వరంలో ఆంధ్ర రాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ సమాఖ్యగా, నాటిన ఉపాధ్యాయ ఉద్యమ విత్తనం, ఎనిమిది దశాబ్దాల కాలంలో ఒక బలమైన వృక్షంగా ఎదిగి, ఆంధ్ర–తెలంగాణ విద్యా వ్యవస్థలకు నీడనిచ్చే స్థాయికి చేరుకుంది. "ఉపాధ్యాయులు కేవలం ఉద్యోగులు కాదు, సమాజ నిర్మాణ శిల్పులు" అనే భావనను కేవలం నినాదంగా కాక, ఆచరణలో నిరూపించిన సంఘం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్. బ్రిటిష్ పాలన నడుమ, విద్యా రంగంలో అసమానతలు, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించిన రోజుల్లోనే ఈ సంఘం పుట్టింది. అప్పటివరకు వ్యక్తిగతంగా, ఒంటరిగా వినిపించిన ఉపాధ్యాయుల వేదనను సంఘటిత శక్తిగా మలచిన తొలి ప్రయత్నమిది.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

1947లో శ్రీ చెన్నుపాటి లక్ష్మయ్య గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్‌గా పునర్వ్యవస్థీకరణ జరగడం, ఈ ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన చారిత్రక ఘట్టం. స్వాతంత్ర్యం సిద్ధించిన కొత్త భారతదేశంలో, ప్రజాస్వామ్య విలువలకు పునాదిగా విద్యను నిలబెట్టాలంటే ఉపాధ్యాయుడికి గౌరవం, భద్రత, వృత్తిపరమైన స్వేచ్ఛ అవసరమని ఈ సంఘం బలంగా వాదించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్మితమైన సంఘటనా వ్యవస్థ, లక్షలాది ఉపాధ్యాయులను ఒకే వేదికపైకి తీసుకొచ్చింది. ఈ ఎనిమిది దశాబ్దాల ప్రయాణంలో ఏపీటీఎఫ్ సాధించిన విజయాలు అనేకం. వేతన సవరణల విషయంలో ప్రభుత్వాలపై నిరంతర ఒత్తిడి తీసుకురావడం, పేడ్ స్కేల్స్, టైమ్ బౌండ్ ప్రమోషన్లు, పదోన్నతులలో ఉన్న అసమానతలను సరిదిద్దడం వంటి అంశాల్లో ఈ సంఘం కీలక పాత్ర పోషించింది. పెన్షన్ హక్కును ఉపాధ్యాయుల మౌలిక హక్కుగా నిలబెట్టడంలో, కుటుంబ పెన్షన్, గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలను విస్తరించడంలో సంఘం చేసిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోయాయి. ఒక దశలో ఉపాధ్యాయ నియామకాలు నిలిచిపోయిన సందర్భాల్లో, ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ ఉద్యమాలు చేసి, వేలాది పోస్టులు భర్తీ అయ్యేలా చేయడంలో ఈ సమాఖ్య పాత్రను విస్మరించలేం. విద్యార్థుల భవిష్యత్తు కూడా ఉపాధ్యాయ ఉద్యమానికి కేంద్రబిందువే. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, మధ్యాహ్న భోజన పథకం సమర్థవంతంగా అమలు కావడం, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫార్ములు, స్కాలర్‌షిప్‌ల విషయంలో ప్రభుత్వ విధానాల్లో స్పష్టత తీసుకురావడం వంటి అంశాల్లో ఏపీటీఎఫ్ నిరంతరం జోక్యం చేసుకుంది. విద్యా విధానాల రూపకల్పనలో ఉపాధ్యాయుల అనుభవాన్ని పరిగణలోకి తీసుకోవాలనే డిమాండ్‌తో ఈ సంఘం ఎన్నోసార్లు ప్రభుత్వాలతో చర్చలు జరిపింది. ఫలితంగా పాఠ్య ప్రణాళికల్లో, బోధనా విధానాల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

2014 జూన్ 2న రాష్ట్ర విభజనతో ఈ ఉద్యమం మరో కీలక దశలోకి ప్రవేశించింది. ఉమ్మడి రాష్ట్రంలో ఒకటిగా ఉన్న ఉపాధ్యాయ సమాఖ్య, రెండు రాష్ట్రాల వాస్తవాల ప్రకారం పునర్నిర్మాణం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత టీఆర్టీఎఫ్ తక్కువ కాలంలోనే వేలాది సభ్యులతో బలమైన సంఘంగా ఎదిగింది. వేతన సవరణలలో ప్రాంతీయ అసమానతలను సరిదిద్దడం, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాల వల్ల ఉపాధ్యాయ వృత్తికి ఏర్పడిన సవాళ్లను ఎదుర్కోవడం, బదిలీలు-ప్రమోషన్లలో పారదర్శకత కోసం పోరాటం చేయడం వంటి అంశాల్లో టీఆర్టీఎఫ్ ముందుండి పనిచేస్తోంది. ఉపాధ్యాయుల పని భారం పెరుగుతున్న నేపథ్యంలో, విద్యేతర పనుల నుంచి ఉపాధ్యాయులను విముక్తి చేయాలనే డిమాండ్‌తో చేసిన ఉద్యమాలు, ప్రభుత్వ విధానాల్లో కొన్ని మార్పులకు దారి తీశాయి. కరోనా వంటి సంక్షోభకాలంలో ఉపాధ్యాయుల ఆరోగ్యం, భద్రతపై టీఆర్టీఎఫ్ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఆన్‌లైన్ బోధన వల్ల ఏర్పడిన సాంకేతిక సమస్యలు, ఇంటర్నెట్ ఖర్చులు, మానసిక ఒత్తిడి వంటి అంశాలపై ప్రభుత్వానికి వినతులు సమర్పించి, ఉపాధ్యాయులకు కొంత ఊరట కలిగించే చర్యలు తీసుకునేలా చేసింది. పాఠశాలల పునఃప్రారంభం సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించాలనే అంశాన్ని కూడా సంఘం బలంగా లేవనెత్తింది. నేడు మాన్యులు శ్రీ మానేటి ప్రతాపరెడ్డి, శ్రీ కటుకం రమేష్, శ్రీ మారెడ్డి అంజిరెడ్డి, శ్రీ సుంకెశీల ప్రభాకర్ రావు గారల నాయకత్వంలో టీఆర్టీఎఫ్ తన ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తోంది. ఉపాధ్యాయుల వేతనాలే కాదు, వృత్తి గౌరవం, సామాజిక ప్రతిష్ట, విద్యా నాణ్యత అన్నింటినీ ఒకే సమీకరణంలో చూడాలనే దృక్పథంతో సంఘం ముందుకు సాగుతోంది. ఎనభై వసంతాల చరిత్రను వెనక్కి తిరిగి చూసుకుంటే, ప్రతి దశలోనూ పోరాటం, త్యాగం, సాధనలే కనిపిస్తాయి. ఈ నేపథ్యంలో నిర్వహించబడుతున్న అభ్యుదయోత్సవం, కేవలం ఒక సభగా పరిమితం కాదు. ఇది

గత తరం ఉపాధ్యాయుల త్యాగాలకు నివాళి, వర్తమాన తరం బాధ్యతలకు గుర్తు, రాబోయే తరాలకు మార్గదర్శనం. నాగోల్‌లోని సాయిరాం గార్డెన్స్ వేదికగా డిసెంబర్ 21న ఆదివారం జరగనున్న ఈ మహాసభ, ఉపాధ్యాయ ఐక్యతను మరోసారి చాటే వేదికగా నిలవనుంది. ఎనిమిది దశాబ్దాలుగా వెలిగిన ఉద్యమ జ్యోతి, రాబోయే కాలంలోనూ విద్యా రంగాన్ని, సమాజాన్ని వెలుగులు నింపుతుందనే విశ్వాసమే ఈ అభ్యుదయోత్సవానికి ప్రాణం.

(వ్యాసకర్త సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్)

సత్యం వైపు ఒక అడుగు హైదరాబాద్ బుక్ ఫెయిర్ స్టాల్ 255

ముహమ్మద్ ముజాహిద్
96406 22076

నేటి సమాజంలో ఇస్లాంపై నెలకొన్న అపార్థాలను తొలగించి, సత్యాన్ని చాటిచెప్పేందుకు 'సాహిత్యం' ఒక శక్తివంతమైన ఆయుధంగా మారింది. ముఖ్యంగా జిహాద్ అంటే విధ్వంసం కాదు అది అంతర్గత శుద్ధీకరణ అని; ఇస్లాంలో మహిళలు అణచివేతకు గురికావడం లేదు హిజాబ్ వెనుక ఆత్మాభిమానం దాగి ఉందని; మరియు వడ్డీ, మద్యం వంటి సామాజిక రుగ్మతలకు ఖుర్‌ఆన్ శాశ్వత పరిష్కారాలను చూపుతుందని నిరూపించే అద్భుతమైన పుస్తకాలు ఇప్పుడు మనకు అందుబాటులో ఉన్నాయి. అపోహల పొరలు వీడి, యథార్థాన్ని అన్వేషించే ప్రతి ఒక్కరినీ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లోని స్టాల్ నంబర్ 255 సాదరంగా ఆహ్వానిస్తోంది.

అపోహల పొరలు వీడి..
వాస్తవాల వెలుగు వైపు ఖుర్‌ఆన్ పిలుస్తోంది!

నేడు సమాజంలో సమాచారం కంటే అసత్య ప్రచారమే వేగంగా విస్తరిస్తోంది. టీవీ తెరల మీద జరిగే చర్చలు, సామాజిక మాధ్యమాల్లో సాగే విమర్శలు తరచుగా ఇస్లాంను, ముస్లిం జీవన విధానాన్ని ఒక వివాదంగానే చిత్రీకరిస్తున్నాయి. జిహాద్, తలాక్, హిజాబ్ వంటి అంశాలను సందర్భోచితంగా కాకుండా, కేవలం 'ఇస్లామోఫోబియా'ను పెంచే సాధనాలుగా వాడుకుంటున్న తరుణమిది. అయితే, చీకటి ఎంత దట్టంగా ఉన్నా.. సత్యం యొక్క చిన్న కిరణం దాన్ని పటాపంచలు చేయగలదు. ఆ సత్య కిరణమే 'సాహిత్యం'.

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్:
నాలుగు దశాబ్దాల నిశ్శబ్ద విప్లవం

నిజం తెలుసుకోవాలనే తపన ఉన్న మేధావులకు, విజ్ఞులకు ఇప్పుడు ఒక అద్భుతమైన వేదిక దొరికింది. అదే హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లోని స్టాల్ నంబర్ 255.

ఇక్కడ తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (TIPT) గత 40 ఏళ్లుగా చేస్తున్న కృషి అక్షర రూపంలో కనిపిస్తుంది. ఉర్దూ, అరబిక్ భాషలకే పరిమితమైన ఇస్లాం మూల సూత్రాలను తెలుగువారికి చేరువ చేస్తూ, ఈ సంస్థ ఒక భావజాల వారధిగా నిలుస్తోంది.

పుస్తకం: అపార్థాలను తుడిచేసే అస్త్రం

ఈ స్టాల్‌లో కొలువుదీరిన 300కు పైగా పుస్తకాలు కేవలం కాగితాలు కావు; అవి అపోహలపై సంధించిన అస్త్రాలు.

- **జిహాద్ అంటే విధ్వంసం కాదు:** అది అంతర్గత శుద్ధీకరణ, అన్యాయంపై అహింసాయుత పోరాటం అని ఇక్కడి సాహిత్యం నిరూపిస్తుంది.
- **మహిళా హక్కులు:** ఇస్లాంలో మహిళలకు ఉన్న గౌరవాన్ని, హిజాబ్ వెనుక ఉన్న ఆత్మాభిమానాన్ని తర్కబద్ధంగా వివరిస్తున్నాయి.
- **సామాజిక పరిష్కారాలు:** వడ్డీ వ్యాపార కోరల్లో చిక్కుకున్న పేదరికం, మత్తులో మునిగిపోతున్న యవ్వనం.. ఇలా నేటి సమాజ రుగ్మతలకు ఖుర్‌ఆన్ చూపే పరిష్కార మార్గాలు ఇక్కడ పుస్తక రూపంలో లభిస్తున్నాయి.
- "విమర్శ వచ్చినప్పుడే వాస్తవం బయటకు వస్తుంది. కానీ ఆ వాస్తవం అన్వేషించే ధైర్యం ఉండాలి."
- **మానవత్వపు మహనీయుడు:** ముహమ్మద్ ప్రవక్త (స) ఇటీవలి కాలంలో ప్రవక్తపై జరుగుతున్న అసత్య ప్రచారాల నేపథ్యంలో, ఆయన అసలు వ్యక్తిత్వం ఏమిటో తెలుసుకోవాలనే ఆసక్తి తెలుగు పాఠకుల్లో పెరగడం శుభపరిణామం. ఆయన శాంతి దూతగా, ఒక గొప్ప సంస్కర్తగా ఎలా నిలిచారో తెలిపే జీవిత చరిత్ర పుస్తకాలు నేడు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. ఇది కేవలం పుస్తకాల అమ్మకం కాదు.. ఒక సంస్కృతి పట్ల పెరుగుతున్న గౌరవం.

శాంతి వైపు అడుగులు..

కేవలం ఆధ్యాత్మికత మాత్రమే కాదు, సామాజిక సామరస్యం ఈ పుస్తకాల అంతస్సూత్రం. పిల్లలకు నీతి కథలు, మహిళలకు మార్గదర్శక గ్రంథాలు, ఆచార వ్యవహారాల వివరణలు.. ఇలా స్టాల్ నంబర్ 255 ఒక జ్ఞాన భాండాగారంగా మారింది.

అజ్ఞానం వల్ల పుట్టే భయం కంటే, అన్వేషణ ద్వారా వచ్చే జ్ఞానం గొప్పది. ఇస్లాంపై ఉన్న మేఘాలను పక్కకు నెట్టి, సత్యాన్ని దర్శించాలనుకునే ప్రతి సత్యప్రియుడు తప్పక సందర్శించాల్సిన చోటు ఇది. రండి, అక్షరం సాక్షిగా అపోహలను వీడదాం. మానవత్వపు విలువలను పంచుకుందాం.

(మరిన్ని వివరాల కోసం: హైదరాబాద్ బుక్ ఫెయిర్, ఎన్టీఆర్ స్టేడియం, స్టాల్ నంబర్: 255)

ఆధ్యాత్మిక స్థిరత్వాలకు మార్గం 'ధ్యాన అభ్యాసం'

ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

ప్రపంచ శాంతి, అంతర్గత ప్రశాంతత, మానసిక స్థిరత్వాల కోసం ధ్యాన ప్రక్రియ ప్రధానంగా దోహదపడుతుందని గుర్తించిన ఐరాస సర్వసభ్య సమావేశం చేసిన తీర్మానం ప్రకారం, 2024 నుంచి ప్రతి ఏట 21 డిసెంబర్ రోజు ప్రపంచ దేశాలు "ప్రపంచ ధ్యాన దినోత్సవం (వరల్డ్ మెడిటేషన్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. 21 డిసెంబర్ రోజు ఉత్తర అర్ధగోళంలో శీతాకాలపు అయనాంతంతో (వింటర్ సోస్టిస్) కలిసి వస్తుందనే దృగ్విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ దినోత్సవం నిర్ణయించబడింది. ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించడంతో విశ్వ శాంతి వర్ధిల్లడం, స్వీయఅవగాహన పెరగడం, సామూహిక చైతన్యం వికసించడం, అంతర్గత ప్రశాంతత వృద్ధి చెందడం, మానసిక నిశ్చలత చేకూరడం, శారీరక దృఢత్వం పెరగడం, భావోద్వేగ నియంత్రణ కలగడం లాంటి ప్రయోజనాలను ప్రచారం చేయడానికి వేదిక లభించినట్లు అవుతున్నది. ప్రపంచ ధ్యాన దినోత్సవం 2025 ఇతివృత్తంగా "అంతర్గత శాంతి, ప్రపంచ సామరస్యం (ఇన్నర్ పీస్, గ్లోబల్ హార్మొని)" అనబడే అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన భారతీయ ధ్యాన ప్రక్రియ ధ్యానం ఒక పురాతన అభ్యాసం. వేల ఏండ్లుగా ఆచరించబడుతున్న సంపూర్ణ ఆరోగ్య ప్రదాయిని. క్రీస్తుకు పూర్వం 5,000 నాటికే భారతంలో ధ్యాన అభ్యాసం ప్రారంభమైనది. హిందువులు, బౌద్ధుల సంప్రదాయంలో అంతర్భాగంగా ధ్యానం సమ్మిళితం అయ్యింది. ఒక వ్యక్తిలో మానసిక ప్రశాంతత, భావోద్వేగ నియంత్రణ, శారీరక ఆరోగ్యం సాధించడానికి బుద్ధి, కేంద్రీకృత ఏకాగ్రతతో కూడి ఆలోచన పద్ధతులను ఉపయోగించే క్రియను ధ్యానంగా అర్థం చేసుకోవాలి. స్వీయ సాక్షాత్కారం, జ్ఞానోదయం సాధించడానికి ఉద్దేశించబడిన ఆధ్యాత్మిక సాధనగా ధ్యానానికి పేరు ఉంది. ఇస్లామిక్ సూఫీ ఆధ్యాత్మికవేత్తలు, క్రైస్తవ సన్యాసులు, జైన మతస్థులు, టావోయిజం పాటించే వారు, సిక్కులు, జొరాస్ట్రియన్లు కూడా ధ్యాన ప్రార్థనలు చేసే వారని చరిత్ర తెలుపుతున్నది. అష్టాంగ యోగాలలో కీలకమైన ప్రక్రియ ధ్యానం అని పతంజలి యోగ సూత్రాలలో వర్ణించబడింది.

ధ్యానం వల్ల ప్రయోజనాలు

ధ్యానం అభ్యాసం చేయడం ద్వారా మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశలు తగ్గడంతో పాటు ఏకాగ్రత పెరిగి సంపూర్ణ మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుంది. ధ్యానం చేయడం వల్ల రక్తపోటు నియంత్రణ, రోగనిరోధకశక్తి పెరగడం, దీర్ఘకాలిక నొప్పులు తగ్గడంతో శారీరక ఆరోగ్యం ఒనగూడుతుంది. ధ్యానం పాటించే వారిలో భావోద్వేగ స్థిరత్వం, స్వీయఅవగాహనలు పెరుగుతాయి. అంతర్గత శాంతి, జ్ఞానోదయాలను ధ్యాన ప్రక్రియ పెంచుతుంది. ధ్యానం అభ్యాసం చేయడం వల్ల దృష్టి, జ్ఞాపకశక్తి, నిర్ణయం తీసుకునే సామర్థ్యాలు పెంపొందించబడతాయి. మానసిక శారీరక శ్రేయస్సుకు ధ్యానం ఉపకరిస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించడం హర్షదాయకం. ప్రపంచ ధ్యాన జదినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది ధ్యాన సాధకులు 21 డిసెంబర్ రోజు హైదరాబాదు శివారు హార్ట్‌ఫుల్‌నెస్ ప్రధాన కార్యాలయం కన్హా శాంతివనంలో ప్రత్యక్షంగా 40,000 మంది, పరోక్షంగా లక్షలాది మంది ధ్యాన అభ్యాసం చేయడానికి ఏర్పాట్లు పెద్ద ఎత్తున జరిగాయి. ధ్యానం, యోగాలు ఒకదానితో మరొకటి లోతుగా అనుసంధానం చేయబడి ఉన్నాయి. ధ్యానం మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సుపై దృష్టి పెడుతుంది. ధ్యానంతో శరీరం, ఆత్మ, మనస్సుల మధ్య సమతుల్యత పెంపొందించబడుతుంది. మన వ్యక్తిగత సంపూర్ణ ఆరోగ్యం కోసం నిత్యం ధ్యానం చేయడానికి సమయం కేటాయించడం, ధ్యాన ప్రధాన కార్యశాలలను నిర్వహించడం, కమ్యూనిటీ ధ్యాన శిబిరాలను నిర్వహించడం, ధ్యాన ప్రక్రియను ప్రచారం చేయడం, సోషల్ మీడియా వేదికగా ధ్యాన ప్రాధాన్యాలను వివరించడం లాంటివి చేయడానికి ప్రయత్నించాలి.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
90102 23917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

అబద్ధాల నోబెల్ రేవంత్ రెడ్డికే ఇవ్వాలి

- మాజీ మంత్రి హరీష్ రావు

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, డిసెంబర్ 20: రాజకీయాల్లో అబద్ధాలు చెప్పడంలో నోబెల్ ప్రైజ్ ఇస్తే, అది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే ఇవ్వాలని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. సంగారెడ్డి నియోజకవర్గంలో గెలిచిన సర్పంచ్, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌తో కలిసి హరీష్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కేసులు పెట్టినా, డబ్బులు పంచినా, గుండాయిజం చేసినా బీఆర్ఎస్ 40 శాతం పైగా అంటే నాలుగు వేలకు పైగా సర్పంచ్ స్థానాలు గెలుచుకుని తన సత్తా చాటిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధారణంగా అధికార పార్టీ 90 శాతం గెలుస్తుందని, అలాంటిది కాంగ్రెస్ అధికారంలో ఉండి కూడా బీఆర్ఎస్ ఇంత భారీగా గెలవడం కాంగ్రెస్ వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. సంగారెడ్డిలో 34 సర్పంచ్ స్థానాలు ఉంటే అందులో 27 కాంగ్రెస్ గెలిచిందని సీఎం చెబుతున్నారని, బీఆర్ఎస్ తరపున గెలిచిన సర్పంచులను కూడా కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. 50 శాతం కూడా రాని గెలుపును 66 శాతంగా చూపిస్తున్నారని ఆరోపించారు. రైతులు ఎరువుల కోసం లైన్లలో నిలబడి గోసపడుతుంటే యాప్‌లు, మ్యాప్‌ల పేరుతో ప్రభుత్వం డ్రామాలు చేస్తోందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో కరెంటు, నీళ్లు, ఎరువులు సమృద్ధిగా ఉండేవని, ప్రస్తుతం రైతుబంధు, యాసంగి బోనస్, రుణమాఫీ సరిగా అమలు కావడం లేదన్నారు. ఎరువుల బస్తాల కోసం యాప్‌లో బుక్ చేయాలంటూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, కోఆపరేటివ్ ఎన్నికలు పెట్టడానికి సీఎం భయపడుతున్నారని, ఓటమి భయంతోనే ఎన్నికలు వాయిదా వేస్తున్నారని అన్నారు. సర్పంచ్‌లకు చెక్ పవర్ ఉందని, ధైర్యంగా పనిచేయాలని సూచించారు. రేవంత్ రెడ్డి రేసింగ్ సీఎం కాదని, ఢిల్లీ-హైదరాబాద్ మధ్య తిరిగే ఫ్లయింగ్ సీఎంలా మారారని విమర్శించారు. ప్రజల సమస్యలు పట్టించుకోకుండా ఫుట్ బాల్ మ్యాచ్‌లు, గ్లోబల్ సమ్మిట్లు, అందాల పోటీలు నిర్వహించడంపై మండిపడ్డారు. ప్రభుత్వ సొమ్మును జల్సాలకు ఖర్చు చేయడం తగదన్నారు. రెండేళ్లలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని, సర్పంచ్‌ల ఐదేళ్ల పదవీకాలంలో మిగిలిన మూడేళ్లు కేసీఆర్ ప్రభుత్వంలోనే కొనసాగుతాయని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు. గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

కార్మికుల అండ.. సీఐటీయూ జెండా

- జిల్లా కోశాధికారి,
  యూనియన్ అధ్యక్షులు కే.రాజయ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 20 : హత్నూర మండలంలోని ఎస్ బి ఆర్గానిక్ పరిశ్రమలో సిఐటియు జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది, దీనికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా కోశాధికారి యూనియన్ అధ్యక్షులు కే. రాజయ్య జండా వేసి అనంతరం ఆయన మాట్లాడారు. జెండా ఆవిష్కరణ అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికలకు అండగా సిఐటియు జెండాని ఆయన అన్నారు, పోరాడితేనే హక్కులు వస్తాయని ఆయన అన్నారు. దేశంలోనే కార్మికుల సమస్యలపై అవిశ్రాంత, సమరశీల పోరాటలు నిర్వహిస్తున్న ఏకైక సంఘం సీఐటీయూ అని ఆయన అన్నారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సంఘం సీఐటీయూ అని, దేశంలో ఐక్య ఉద్యమాల సారథి సిఐటియు అని ఆయన అన్నారు. ప్రైవేటీకరణ నుంచి మొదలుపెట్టి ప్రతి సమస్యపై పోరాటంలో సిఐటియు అగ్రభాగాన ఉంటుందని ఆయన అన్నారు. ప్రత్యేకంగా ఇటీవల కాలంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక చర్యలు ఉధృతం అయ్యాయని అన్నారు, కార్మిక చట్టాలన్నీ రద్దు చేయడం చాలా దుర్మార్గమని ఆయన అన్నారు. స్వాతంత్ర్యం రాకముందు ఉన్న పరిస్థితి మరోసారి భారతదేశంలో వస్తుందని ఆయన అన్నారు, కార్మిక వర్గం అంతా ఐక్యమై ఐక్య పోరాటాల ద్వారా తిప్పే కొట్టకపోతే భవిష్యత్తు ఉండదని ఆయన అన్నారు, లేబర్ కోడ్ లను ఎట్టి పరిస్థితిలో రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సాయిలు, జిల్లా ఉపాధ్యక్షులు మాణిక్యం, జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి తదితరులు ప్రసంగించారు. యూనియన్ జనరల్ సెక్రెటరీ యాదగిరి నాయకులు శ్రీరాములు చంద్రారెడ్డి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ రఘునందన్ రావు కలిసిన బాకారం సర్పంచ్

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 20 : గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలని తన పూర్తి మద్దతు సహకారం ఉంటుందని, బిజెపి నుండి పథకాలను బాకారం ప్రజలందరికీ అందే విధంగా పూర్తి సహకారం ఉంటుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు, ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో విజయం సాధించిన భాకరం గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్‌గౌడ్ మెదక్ ఎంపీ రఘునందన్ రావుని మర్యాదపూర్వకంగా కలిశారు, అనంతరం శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు, గ్రామాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు,

వర్గల్ క్షేత్రంలో మూలా నక్షత్ర విశేష పూజ

- వైకుంఠ ఏకాదశి వేడుకలకు సన్నాహాలు

ప్రతిపక్షం, గజ్వేల్(వర్గల్), డిసెంబర్ 20: మండల కేంద్రంలో వెలసిన ప్రసిద్ధ విద్యాధరి క్షేత్రంలో శనివారం మూలా నక్షత్ర విశేష పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు తెల్లవారు జామున అమ్మవారికి విశేష అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు, చండీ హోమం, లక్ష పుష్పార్చన తదితర ఘనంగా నిర్వహించారు.అనంతరం ఈనెల 30న జరగనున్న వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని చైర్మన్ చంద్రశేఖర శర్మ ఆలయ కమిటీకి సూచించారు.

గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలి

- కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీంభరత్

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 20 : గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలని తన పూర్తి మద్దతు సహకారం ఉంటుందని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీంభరత్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ రాములు చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీంభరత్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీంభరత్ వారికి శాలువాతో సన్మానించి, పుష్ప గుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.కాంగ్రెస్ పాలనలో గ్రామ పంచాయతీలు దేశానికే ఆదర్శంగా నిలిచేందుకు సిఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యధావిధిగా ప్రజావాణి

- జిల్లా కలెక్టర్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి,డిసెంబర్ 20 : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత కలెక్టరేట్ సముదా యంలోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 22వ తేదీ (సోమవారం) నుండి యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి . ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యధావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

ఐనవోలు జాతరకు పటిష్ట ఏర్పాట్లు

- మంత్రి కొండా సురేఖ

ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్20: ఐనవోలు శ్రీ మల్లికార్జునస్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు, శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలు లో ఐనవోలు జాతర ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఆలయ కమిటీ ప్రతినిధులతో కలసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, భద్రత వంటి జాతరలో ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు లు సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ జాతర నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించాలన్నారు. జాతరలో పారిశుధ్య నిర్వహణ ఎంతో ముఖ్యమని పంచాయతీ అధికారులు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అవసరమైతే పక్కన ఉన్న గ్రామ పంచాయతీలకు సంబంధించిన సిబ్బందిని పారిశుధ్య నిర్వహణకు కేటాయించాలని సూచించారు. జాతరలో ఇరవై నాలుగు గంటలు విద్యుత్ అంతరాయం లేకుండా ఏ చిన్న సమస్య లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చూసుకోవాలన్నారు. భక్తుల ఆరోగ్య సంరక్షణ కు జాతర ప్రాంగణంలో వైద్య సదుపాయాలు కల్పించాలని అన్నారు. జాతర లో 108 వాహనాలు అందుబాటులో ఉంచాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జాతరలో మెరుగైన సౌకర్యాలను వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. వివిధ శాఖలు ఏర్పాట్లు పూర్తిచేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ జాతర లో పది వాటర్ ట్యాంకర్లను జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తామని, డంపర్ బిన్లను ఏర్పాటు చేసి పారిశుధ్య నిర్వహణ చేపడుతామన్నారు. సమీకక్షా సమావేశం అనంతరం జాతర ఉత్సవాల పోస్టర్లను మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు, కలెక్టర్ స్నేహ శబరీష్, ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీసీపీ అంకిత్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్ గౌడ్, కార్యనిర్వాహణాధికారి సుధాకర్, సిపిఓ అజిత్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యతోనే మంచి భవిష్యత్తు

- మండల విద్యాధికారి మల్లయ్య
- ఛాలెంజర్ ఇంటర్నేషల్ పాఠశాలలో కార్నివాల్ కార్యక్రమం

ప్రతిపక్షం, మొయినాబాద్ , డిసెంబర్ 20: విద్యతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని మండల విద్యాధికారి మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఛాలెంజర్ ఇంటర్నేషనల్ స్కూల్ లో కార్నివాల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి మల్లయ్య, చాలెంజర్ ఇంటర్నేషనల్ పాఠశాల సహాయత ట్రస్ట్ సయ్యద్ అనీజుద్దీన్, సీఈవో ఇఫ్తికారుద్దీన్ గౌరీ, ట్రెజరర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈలెంట్ లో డ్రాయింగ్ , గణితం, ఆంగ్లం, విజ్ఞాన శాస్త్రాలను ప్రదర్శించే అకాడమిక్ స్టాల్స్ ఉన్నాయి. ఇవి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా సృజనాత్మకతతో నిండాయి. పేస్ పేయింటింగ్ ,ట్రమ్పోలిన్, గుర్రపు స్వాకీ వంటివి కార్నివాల్లో ప్రత్యేక ఆకర్షణంగా నిలిచాయి. ఈ గ్రాండ్ కార్నివాల్ కేవలం పండుగ వేడుకంటే ఎక్కువగా కమ్యూనిటీ బాండింగ్, ఉపయోగపడుతుంది. ఈ వేడుకలో పాల్గొన్న విద్యార్థులను, ఈవెంట్ విజయవంతానికి అభినందించడంలో కార్యక్రమం ముగిసింది.

సంక్షేమం అభివృద్ధికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 20 : ప్రజాపాలనలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం అమీన్పూర్ పరిధిలోని పటేల్ గూడ, కిష్టారెడ్డిపేట, సుల్తాన్పూర్ లలో 65 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్నసిసి రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు, శంకుస్థాపన ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని చిన్న కంజర్ల నుండి అందూర్ వరకు 60 లక్షల రూపాయలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల మధ్య ఇంటర్ లింక్ రోడ్లు నిర్మిస్తూ.. మెరుగైన రవాణా సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న జనాభా కు నాగునంగా ఏర్పడుతున్న కాలనీలలోనూ మౌలిక వసతులు కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల జిహెచ్ఎంసిలో విలీనమైన మున్సిపాలిటీల అభివృద్ధికి సైతం ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున నిధులు కేటాయించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, పంచాయతీరాజ్ డిఇ సురేష్ సీనియర్ నాయకులు నారాయణ రెడ్డి, వెంకట్ రెడ్డి, రామచందర్, ఖదీర్, పిఆర్ డిఈ సురేష్, సత్యనారాయణ, రాజు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీలత లైసెన్సులు రద్దు చేయాలని కలెక్టర్కు వినతి

ప్రతిపక్షం, మంచిర్యాల, డిసెంబర్ 20: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉన్న శ్రీలత నర్సింగ్ హోమ్ లైసెన్సులు రద్దు చేయాలని ఈనెల 15న కడుపులో ఉన్న బిడ్డ మృతికి కారకు లైన బాధిత కుటుంబానికి 25 లక్షల ఎక్స్గ్రేసియా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ కు డిఎం అండ్ హెచ్ ఓ అనితకు వినతి పత్రం అందజేశారు. కాగజ్ నగర్ కు చెందిన వసంతరావు కుమ్మరి పద్మ నెల 15న డెలివరీ నిమిత్తం హాస్పిటల్లో ఒంటిగంటకు అడ్మిట్ చేరిందన్నారు సాయంత్రం మూడు 46 కు డాక్టర్ కన్సల్ట్ మేరకు ఆపరేషన్ చేస్తానని రాత్రి 9 గంటలకు బాధితురాలని కలిసి కడుపులో బిడ్డ ప్రమాద స్థితిలో ఉందని చెప్పడం జరిగిందన్నారు. అనంతరం ఆపరేషన్ చేయగా మృతి చేయడం జరిగింది అన్నారు. డాక్టర్ నిర్లక్ష్యం వల్లే కడుపులోని బిడ్డ మృతి చెందినదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ స్పందిస్తూ శ్రీలత నర్సింగ్ హోమ్ లో జరిగిన సంఘటన విషయంలో ప్రత్యేకమైన కమిటీ నియమిస్తామని అనంతరం శ్రీలత పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు జడ్పీటీసీ జిల్లా ఫోరం మాజీ అధ్యక్షుడు కొయ్యడ ఏ పాజి, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- బ్లాక్ స్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 20 : రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన అదనపు కలెక్టర్ అంకిత్, అదనపు డీ.సీ.పీ బస్వారెడ్డి, ఇతర అధికారులతో కలిసి నిజామాబాద్ నగర శివార్లలో తరుచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మాక్లూర్ మండలం మానిక్ బండార్ చౌరస్తా సమీపంలోని సుఖ్ జిత్ స్టార్చ్ మిల్ వద్ద, బోధన్ రోడ్డు లోని ఎన్.ఎన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ ఎదురుగా గల ప్రధాన రహదారులను సందర్శించారు. పై ప్రదేశాలలో ఎక్కువగా ప్రమాదాలు జరిగేందుకు గల కారణాల గురించి పోలీస్, రోడ్లుభవనాలు, పంచాయతీరాజ్, రవాణా తదితర శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. ముఖ్యంగా బోధన్ రోడ్ ఎన్.ఎన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ వద్ద గడిచిన మూడు సంవత్సరాల వ్యవధిలోనే రోడ్డు ప్రమాదాలలో 19 మంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందని ఈ సందర్భంగా ప్రమాదాల తీవ్రతపై కలెక్టర్ ఒకింత ఆందోళన వెలిబుచ్చారు. జిల్లా వ్యాప్తంగా గల అన్ని రహదారులపై బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన ప్రదేశాలలో ప్రమాదాలను నియంత్రించేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మూల మలుపులు, కల్వర్టులు, ఎత్తుపల్లాలు, రోడ్డు నిర్మాణం సరిగా లేకపోవడం వంటి వాటిని సరి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేసేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. బ్లాక్ స్పాట్లను పరిశీలించిన అధికారుల బృందంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఎం.వీ.ఐ డి.శ్రీనివాస్, ఆర్ అండ్ బీ అధికారి ప్రవీణ్, ఈదార్ మేనేజర్ హర్ష తదితరులు ఉన్నారు.

అమరావతి ప్రాజెక్ట్ అయితే చాలు ఇతర ప్రాంతాలేమైపోయినా ఫర్వాలేదన్నట్లు సీఎం చంద్రబాబు ఉన్నారు. విశాఖ భూములను తన వారికి కట్టబెట్టి అక్కడ ఏ యాక్టివిటీ లేకుండా అడ్డుకోవాలని చూస్తున్నారు. సెటిల్మెంట్లపై పవన్ అధికారులను కాకుండా భూముల్ని దోచిపెడుతున్న చంద్రబాబును ప్రశ్నించాలి. ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు తప్పదు. అందర్నీ చట్టం ముందు దోషులుగా నిలబెడతా.

\- వైసీపీ నేత అమర్నాథ్

ప్రాంతీయం

స్మార్ట్‌ఫోన్లలో జనగణన.. 2027లో డిజిటల్ సెన్సస్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 20: దేశవ్యాప్తంగా జరగనున్న భారత జనాభా గణన-2027కు కేంద్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి పూర్తిగా డిజిటల్ విధానంలో, స్మార్ట్‌ఫోన్ల ద్వారా జనగణన నిర్వహించేందుకు ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని, ఆఫ్‌లైన్‌లో కూడా పనిచేసేలా ఈ యాప్‌ను రూపొందించారు. పలు ప్రాంతాల్లో యాప్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించగా విజయవంతమైంది. దీంతో జనగణన ప్రక్రియ మరింత సులభంగా, వేగంగా పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. త్వరలోనే సెన్సస్ సిబ్బందికి యాప్ వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. జనగణనను రెండు దశల్లో నిర్వహించనున్నారు. మొదటి దశలో భాగంగా 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు గృహాల జాబితా తయారీ, గృహ గణన చేపడతారు. రెండో దశలో 2027 ఫిబ్రవరి నుంచి జనాభా లెక్కింపు ప్రారంభమవుతుంది. ఈ ప్రక్రియలో దేశవ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది సిబ్బంది పాల్గొననున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఇతర సర్కారు ఉద్యోగులతో పాటు ప్రత్యేకంగా నియమించిన సిబ్బంది ఈ బాధ్యతలు నిర్వహిస్తారు. సేకరించిన సమాచారం నేరుగా డిజిటల్‌గా నమోదు చేయడం వల్ల డేటా లోపాలు తగ్గుతాయని కేంద్రం భావిస్తోంది. తెలంగాణలో జనగణన నిర్వహణకు 200 కోట్ల రూపాయలకుపైగా ఖర్చు అవుతుందని అంచనా. డిజిటల్ సెన్సస్ ద్వారా జనాభా, గృహ వసతులు, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై ఖచ్చితమైన సమాచారం అందుతుందని అధికారులు చెబుతున్నారు.

పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యం

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 20: మెదక్ జిల్లాలో పదవ తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులు అత్యవసర పరిస్థితులు తప్ప సెలవులు పెట్టొద్దని, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు అట్టి సెలవులను మంజూరు చేయవద్దని సూచించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలతో చర్చించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ, ఏఎక్స్ఎల్ అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ..ప్రతి విద్యార్థికి సిలబస్ పూర్తయ్యేలా చూడాలని, రోజూ హాజరు శాతం పెంచాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థులను ఉపాధ్యాయులు అడాప్ట్ చేసుకొని వ్యక్తిగత యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. డ్రాప్‌అవుట్ లేకుండా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్‌పై ఉపాధ్యాయులదే పూర్తి బాధ్యత అని పేర్కొన్నారు. అక్షయపాత్ర మధ్యాహ్న భోజనం, పాఠశాల భద్రత, పోక్సో కమిటీల ఏర్పాటు, అమ్మకు అక్షరమాల వంటి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయాలని తెలిపారు. ఫలితాలు సాధించని కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఈవో విజయ, డైట్ ప్రిన్సిపల్ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈఓ సుదర్శనమూర్తి ఎంఈవోలు హెచ్‌ఎంలు ప్రధాన ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 20: మెదక్ పట్టణంలో జిల్లా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం పంచాయతీరాజ్ ఈఈ నర్సింలు తో కలిసి జిల్లా కేంద్రంలోని నిర్మాణం తుది దశలో ఉన్న మహిళా శక్తి భవనం నిర్మాణ పనులను పరిశీలించారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రూ.5 కోట్ల నిధులతో చేపట్టిన ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలని సూచించారు.

భిన్న సంస్కృతులు ఉన్నా.. ప్రజల్లో ఐక్యత

ప్రతిపక్షం, నంగునూరు డిసెంబర్ 20: భారతదేశంలో భిన్న మతాలు, భాషలు విభిన్న సంస్కృతులు ఉన్నప్పటికీ ఐక్యతలో భారతీయులు అంతా ఒక్కటిగానే వుంటారని అక్కెనపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ ప్రధానాచార్యుడు మంద జానయ్య చెప్పారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్ లో పీఎంశ్రీ ప్రోగ్రాంలో భాగంగా శనివారం ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జానయ్య మాట్లాడుతూ భారతదేశం భిన్నత్వంలో ఏకత్వాన్ని కలిగి ఉంటుందని చెప్పారు. దేశ భక్తిని విద్యార్థి దశ నుండే అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మెంటార్ గా వ్యవహరించిన సి.హెచ్. రజని మాట్లాడుతూ భారతీయుల ఐక్యత స్ఫూర్తి పలు సందర్భాలలో చూపించారని తెలిపారు. భారత్ ఒక గొప్ప దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు భారత దేశ ఐక్యతను ప్రతిబింబించే పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎ.శ్రీనివాస్, బి.ప్రభాకర్, శ్రీనివాస్, స్వాతి, భానురేఖ పాల్గొన్నారు.

విపత్తుల పై ప్రజలకు అవగాహన కల్పించాలి

- ఈనెల 22న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ ను విజయవంతంగా నిర్వహించాలి.
- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 20: ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్తుల సమయంలో ప్రాణ నష్టాలను నివారించవచ్చునని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శనివారం, అదనపు కలెక్టర్ ఛాంబర్ లో ప్రకృతి విపత్తుల నిర్వహణకు సంబంధించి మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమ నిర్వహణ, వైపరీత్యాల నివారణ నిర్వహణ చర్యలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ...జిల్లాలోని హవేలీ ఘనపూర్ మండలం దూప్ సింగ్ తండాలో ఈ నెల 22 న విపత్తుల నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్కర సమయాల్లో ప్రాణ నష్టాలు నిర్వహించడంతో పాటు, ఆస్తి నష్టాలు తగ్గించగలుతామని చెప్పారు. వర్షపాతం, ప్రాజెక్టుల నీటిమట్టం, నీరు విడుదల, వంతెనలు, రోడ్ల స్థితి వంటి అంశాల పై పూర్తి సమాచారం ప్రజలకు చేరవేయాలని చెప్పారు. పారిశుధ్య నిర్వహణ, వైద్య సేవలు అనేవి వైపరీత్యాల సమయంలో అత్యంత కీలకమని అన్నారు. జిల్లాలో ఎస్డిఆర్ఎఫ్ బృందాలు, ఎన్డిఆర్ఎఫ్ బృందాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్ఓ భుజంగరావు ఆర్డీవో రమాదేవి, జిల్లా ఫైర్ ఆఫీసర్ వేణు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి

- జిల్లా కలెక్టర్ కె.హైమావతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 20: మహిళలు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ మెలకువలను నేర్చుకొని ఆర్థిక పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ రంగంలో స్వయం సహాయక మహిళా సంఘాలను ప్రోత్సహించడం, అడ్వాన్స్ టెక్నాలజీ పరిశీలన కోసం నాబార్డు వారి ఆర్థిక సహకారంతో సొసైటీ ఫర్ కమ్యూనిటీ ఆర్గనైజేషన్ అండ్ పీపుల్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వారు జిల్లాలోని జిల్లా సమాఖ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు మొత్తం 25 మందిని మహారాష్ట్ర రాష్ట్రంలోనీ నాసిక్ లో గల సయ్యాద్రి ఫామ్స్ లను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు 3 రోజుల టూరు తో పర్యటించనున్న బృందం వాహనాన్ని శనివారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లో పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళ సమాఖ్య సభ్యులకు ఇదొక సువర్ణ అవకాశం అని నాసిక్ లోగల సయ్యాద్రి ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ వారు రైతు ఉత్పత్తిదారుల సమైక్య ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ చేసి ఆర్థికంగా ఎలా విజయం సాధించారో ఈ క్షేత్రస్థాయి పర్యటన ద్వారా ప్రతి విషయాన్నీ క్లుప్తంగా నేర్చుకోవాలని తెలిపారు. ఆర్థికంగా ఎదగడం కోసం ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, ఎల్డీఎం హరిబాబు, అదనపు డిఆర్డిఓ సుధీర్ బాబు, డిపిఎం వాసుదేవ్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక తదితరులు పాల్గొన్నారు.

గుర్రాల శ్రీనివాస్ ను సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 20: దుబ్బాక మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గా ఘన విజయం సాధించిన గుర్రాల శ్రీనివాస్ తో పాటు, ఉప సర్పంచ్ వన్నెల విజయ్ కుమార్ గౌడ్, వార్డ్ మెంబర్ రమేష్ రెడ్డిలను శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించి న వారిలో జాతీయ దళిత రత్న అవార్డు గ్రహీత ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సిద్ధిని రాజ మల్లయ్య మాదిగ, జిల్లా కమిటీ సభ్యులు కుంట మల్లేష్, భూంపల్లి గ్రామ బాబూ జగ్జీవన్ రామ్ యువజన సంఘం సభ్యులు సుక్క రాకేష్, పుల్లని కుమార్, పుల్లని గణేష్, ఎదురు అనిల్ కుమార్, ఎదురు రాజేష్, బొట్ట రాకేష్, చుక్క వేణు, కుంట కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కూలీ ఆత్మహత్య

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 20: అనారోగ్యానికి తోడు ఏర్పడిన ఆర్థిక ఇబ్బందులతో జీవితం మీద విరక్తి చెందిన కూ లీ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుబ్బాక మున్సిపాలిటీలోని దుంపలపల్లి వార్డులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం.... దుంపలపల్లికి చెందిన చింతకింది పరుశరాములు (40) కూలి పని చేస్తూ, భార్య కల్పన, ఒక కుమార్తెతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఐదు సంవత్సరాల క్రితం పరుశరాములకు పక్షవాతం రావడంతో, ఏ పని చేయక, ఇంటివద్దె ఉంటూ, అనారోగ్యానికి చికిత్స తీసుకుంటున్నాడు. దీంతో గత కొంతకాలంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఫలితంగా గత కొంత కాలంగా అతను మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంటి సమీపంలోని ఒక పాత ఇంటిలో పరశురాములు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు అతడిని దుబ్బాక 100 పడకల ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి హామీ నూతన చట్టం కాపీలు దహనం

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 20: సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నూతన గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2025 కాపీలను దహనం చేశారు. అనంతరం సిపిఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.భాస్కర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ 2005 చట్టాన్ని రద్దు చేసి దాని స్థానంలో కేంద్రంలో అధికారం ఉన్న బిజెపి ప్రభుత్వం గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవితా మిషన్ చట్టాన్ని తేవడాన్నీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నూతన చట్టంలో ఉన్న నిబంధనల ప్రకారం పేదలను మరింత పేదరికంలో పడేసే విధానాలే తప్ప గ్రామీణ స్థాయి పేదరికం నిర్మూలించేదిగా లేదని విమర్శించారు. కాబట్టి వ్యవసాయ కూలి కార్మికులు, శ్రామికులు, పేదరైతులు కౌలు రైతులు, వృత్తిదారులు ఐక్యంగా ఈ నూతన ఉపాధి చట్టం బిల్లుకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, సిపిఎం పార్టీ దుబ్బాక పట్టణ కార్యదర్శి కొంపల్లి భాస్కర్, సాదిక్, లక్ష్మినర్సయ్య, సాజిద్, బాసిత్, నాగరాజు, సుధాకర్, మాడవైన రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం రద్దుకై బీజేపీ కుట్ర

- విబిజి రామ్ జి బిల్లును వెనక్కి తీసుకోవాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ

ప్రతిపక్షం, మెదక్ ప్రతినిధి, డిసెంబర్ 20: ఉపాధి హామీ పథకాన్ని పేరు మారుస్తూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం బిల్లు 2025 పేరుతో సంక్షేమ పథకంగా మార్చడం సరైంది కాదని సిపిఎం పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ అన్నారు. శనివారం అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న విబి రామ్ జి బిల్లు ప్రతులను దగ్ధం చేసి, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని వి బి జి రామ్ జి బిల్లు 2025 కొత్త పథకం గా మారుస్తూ అమలు చేయాలని నిర్ణయం చేస్తుందన్నారు. ఈ ఉపాధి హామీ పథకాన్ని 25 సంవత్సరంలో సిపిఎం పార్టీ పోరాటం చేసి పేద ప్రజలకు గ్రామాలలో పనిచేసుకోవడం కోసం సాధించడం జరిగిందన్నారు. 2025 తర్వాత ఇప్పటివరకు కూడా దేశంలో ఉన్నా ప్రతి గ్రామాలలో ఉపాధి హామీ పథకం పేరుతో పని నడుస్తుందన్నారు. కొన్ని లక్షల మంది కార్మికులు ఈ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నారన్నారు. సంవత్సరానికి 100 రోజులుగా ఉన్న పని దినాన్ని 25 రోజులు పెంచుతామని బిజెపి ప్రభుత్వం చెప్తుందన్నారు. డిమాండ్ ను బట్టి నడిచే ఇప్పుడు అవసరాన్ని బట్టి చేసే పథకంగా బిజెపి ప్రభుత్వం మారుస్తుందన్నారు. పెట్టుబడిదారుల కాంట్రాక్టర్లకు మేలు చేసే విధంగా ఈ పథకాన్ని బిల్లు మారుస్తుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లును పార్లమెంట్లో వ్యతిరేకించాలన్నారు ఈ బిల్లును పార్లమెంట్లో వ్యతిరేకించాలని అన్నారు. ఉపాధి హామీ పేరుతోనే యధావిధిగా కొనసాగించాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోరింకల మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు అజయ్, సంతోష్, ఏరియా కమిటి సభ్యులు లచ్చాగౌడ్, నాయకులు కొమురయ్య, యాదగిరి, సత్తెమ్మ, సాయిలు, సత్తయ్య, గట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్య అనేది తరగని గని

రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మెన్ బక్కి.వెంకటయ్య

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 20: విద్య అనేది తరగని గని అని, ఇది జ్ఞానాన్ని, నైపుణ్యాలను అందిస్తూ, వ్యక్తిని సమాజంలో ఉన్నత స్థానంలో నిలబెడుతుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం దుబ్బాక, మిరుదొడ్డి లోని బీసీ సంక్షేమ బాలికల కళాశాల, మిర్ దొడ్డి బాలుర వసతి గృహాల్లో వివిధ రైస్ మిల్లర్స్ అసోసియేషన్సు, మణికంత గ్యాస్ ఏజెన్సీ, శ్రీ బాలాజీ ఆలయం తదితర దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఇందిర తో కలిసి 165 మంది బాలికలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులను అందిస్తున్నారని విద్యార్థులు వాటిని చక్కగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేయవద్దని, ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ, అభివృద్ధి అధికారి సయ్యద్ రఫీక్, మణికంత గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ చింత మణికంత, బాలాజీ ట్రస్ట్ సభ్యులు చింతరాజు, బీసీ సంక్షేమ అదనపు వసతి గృహ అధికారులు మనోజ్, సుశాంత్, హెచ్డబ్ల్యుఓలు సోనీ, రమ, పలువురు బారాస నాయకులు, పలు గ్రామాల సర్పంచ్ లు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం అభివృద్ధి చెందుతోంది. పోరాటాల గడ్డ వైజాగ్‌కు వచ్చిన ప్రతిసారీ ఓ కొత్త అనుభూతి కలుగుతుంది. ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కార్ అమల్లో ఉంది. ఇక్కడి పరిస్థితులను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలో అధికారంలోకి వస్తాం.

-కేంద్ర మంత్రి బండి సంజయ్

‘సర్’తో చొరబాటు దారుల ఏరివేత

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, గువాహటి,డిసెంబర్ 20: ఎన్నికల ప్రక్రియలో చొరబాటుదారులను దూరంగా ఉంచేందుకే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)ను ఎన్నికల కమిషన్ చేపట్టిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. అయితే చొరబాటుదారులను కాపాడేందుకు కొందరు ద్రోహులు ప్రయత్నిస్తున్నారని తప్పుపట్టారు. చొరబాట్లను నిలిపివేసేందుకు కేంద్రం కఠిన చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అసోంలోని గువాహటిలో శనివారంనాడు జరిగిన కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ, అసోం, ఈశాన్య రాష్ట్రాలకు దశాబ్దాలుగా కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ చేసిన తప్పిదాలను తాను సరిదిద్దుతున్నానని చెప్పారు. ‘కాంగ్రెస్ ప్రభుత్వాలు అసోం, ఈశాన్య రాష్ట్రాలను అభివృద్ధికి నోచకుండా పాపం మూటకట్టుకున్నాయి. తద్వారా ఐక్యత, భద్రత, సమగ్రత పరంగా దేశం భారీ మూల్యం చెల్లించుకుంది. కాంగ్రెస్ హయాంలో దశాబ్దాలుగా హింస కొనసాగుతూనే ఉంది. ఆ పరిస్థితిని గత పది, పన్నెండేళ్లలో అధిగమించి ముందుకు వెళ్తున్నాం. ఈశాన్య రాష్ట్రాల్లో హింసాత్మకంగా పేరుపడిన పలు జిల్లాలు ఈరోజు అభివృద్ధి బాట పడుతున్నాయి’ అని మోదీ అన్నారు. చొరబాటు దారులకు కాంగ్రెస్ కొమ్ముకాసేదని, అడవులు, భూములు ఆక్రమించుకుని, అసోం భద్రత, ఉనికికి ప్రమాదకరంగా మారిన చొరబాటుదారులకు కాంగ్రెస్ రక్షణ కల్పించేందని ప్రధాని అన్నారు. దశాబ్దాలుగా ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన ఈ పొరపాట్లను బీజేపీ ప్రభుత్వం సరిదిద్దుతోందని అన్నారు.

విశ్వ వీక్షణం

ఇమ్రాన్ ఖాన్ దంపతులకు 17 యేండ్ల జైలు

ఇస్లామాబాద్, డిసెంబర్ 20: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అతని భార్య బుష్రా బీబీలకు ఊహించని షాక్ తగిలింది. తొషఖానా 2 అవినీతి కేసులో ఫెడరల్ ఇన్వేస్టిగేషన్ ఏజెన్సీ ప్రత్యేక కోర్టు ఇమ్రాన్ ఖాన్ దంపతులకు 17 ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ శనివారం తీర్పునిచ్చింది. ప్రస్తుతం ఇమ్రాన్ ఖాన్ ఉన్న రావల్పిండిలోని అడియాలా జైలులోనే విచారణ జరిపిన న్యాయస్థానం ఈ తీర్పులు వెలువరించడం గమనార్హం. 2021 మే నెలలో సౌదీలో ఇమ్రాన్ పర్యటించారు. 2021 మే నెలలో సౌదీ అరేబియా పర్యటించిన సందర్భంగా యువరాజు ఇమ్రాన్ ఖాన్ దంపతులకు ఖరీదైన ‘బల్గరి’ నగల సెట్ ను బహుమతిగా అందజేశారు. ప్రభుత్వ ఖాజానాకు (తోషఖానా)కు అప్పగించకుండా ఇమ్రాన్ అతని భార్య బుష్రా సొంత ప్రయోజనం కోసం తక్కువ ధరకు విక్రయించినట్లు వచ్చిన ఆరోపణపై కేసు నమోదైంది. ఈ కేసును విచారించిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి షారుఖ్ అర్జుమంద్ ఈ సంచలన తీర్పు ప్రకటించారు. ప్రధాని హూదాలో ఉంటూ నమ్మకద్రోహానికి పాల్పడినందుకు పాకిస్థాన్ పీనల్ కోడ్ సెక్షన్ 409 కింద 10 ఏళ్లు కఠిన శిక్ష, అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద 7 ఏళ్లు సాధారణ శిక్ష విధించారు. అంతేకాదు దంపతులకు చెరో రూ.16.4 మిలియన్ జరిమానా కూడా విధించారు. ఈ తీర్పుతో ఇమ్రాన్ ఖాన్ మరో పదేళ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. ఈ తీర్పును హై కోర్టులో సవాలు చేస్తామని ఇమ్రాన్ ఖాన్ తరుపు న్యాయవాది తెలిపారు.



కనువిందు చేసే చిత్రకోట్

మైమరిపించే అందాల జలపాతం

‘చిత్రకోట్’ దేశంలోనే విశాలమైన జలపాతం. వర్షా కాలంలో ఈ జలపాతం చూపరులను కనువిందు చేస్తుంది. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో ఇంద్రావతి నదిపై ఉన్న ఈ జలపాతం పవిత్ర దంతేశ్వరి ఆలయానికి సమీపంలో ఉంది. పచ్చదనం, పొగమంచు, రెయిన్‌బోలు ఇక్కడ ఆహ్లాదాన్ని కలిగిస్తాయి.

వర్షాకాలంలో చిత్రకోట్ జలపాతం సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తుంది. ఇక్కడి ప్రకృతి అందాలు ఆహ్లాదాన్ని పంచుతాయి. ఈ జలపాతం చుట్టూ పచ్చని చెట్లతో, ఇంద్రధనస్సులు, పొగమంచుతో అందంగా ఉంటుంది. చిత్రకోట్ జలపాతం గోదావరికి ఉపనది అయిన ఇంద్రావతి నదిపై ఉంది. ఈ జలపాతం బస్తర్ జిల్లా కేంద్రమైన జగదల్‌పూర్‌కు పశ్చిమాన సుమారు 38 కిలోమీటర్ల దూరంలో ఉంది. జూలై నుండి అక్టోబరు వరకు వర్షాకాలంలో ఇంద్రావతి నదిని ఉప్పొంగుతుంది. చిత్రకోట్ జలపాతం ఉధృతంగా మారుతుంది. ఈ పెరిగిన నీటి పరిమాణం జలపాతాన్ని శక్తివంతమైన, ఉరుములతో కూడిన క్యాస్కేడ్‌గా మారుస్తుంది. దాదాపు 300 మీటర్లు (980 అడుగులు) వెడల్పుతో విస్తరించి ఉన్న ఈ జలపాతం, 30 మీటర్లు (98 అడుగులు) దిగువకు దూకుతుంది. ఆ సమయంలో ఆ ప్రాంతాన్ని ఒక పొగమంచు స్ప్రే ఏర్పడుతుంది. ఇది జలపాతం ఆకర్షణను పెంచుతుంది. విస్మయం కలిగించే ప్రకృతి అందాలను ఆస్వాదించాలనుకునే వారికి చిత్రకోట్ జలపాతాన్ని సందర్శించడం అనేది అద్భుతమైన మరపురాని అనుభూతిని కలిగిస్తుంది.

చిత్రకోట్ జలపాతం ఒక సహజ ఆకర్షణ మాత్రమే కాకుండా సాంస్కృతిక, చారిత్రక ప్రాముఖ్యతను కలిగి ఉంది. జలపాతం చుట్టూ ఉన్న ప్రాంతంలో వివిధ గిరిజన సమూహాల వారు నివాసం ఉంటారు. వీరు ఈ జలపాతాన్ని పవిత్రంగా భావిస్తారు. స్థానిక ఇతిహాసాలు, జానపద కథలు జలపాతంతో ముడిపడి ఉన్నాయి. చిత్రకోట్ జలపాతం చుట్టుపక్కల ప్రాంతం కూడా పురాతన దేవాలయాలు, పురావస్తు ప్రదేశాలతో నిండి ఉంది. వీటిలో చారిత్రాత్మకమైన దంతేశ్వరి ఆలయం ఒకటి.

వర్షాకాలంలో చిత్రకోట్ జలపాతం మంత్రముగ్ధ దృగ్విషయాలలో ఒకటి తరచుగా ఇంద్రధనస్సులు కనిపించడం. దిగువకు జాలువారే నీటితో సృష్టించబడిన పొగమంచుతో తరచుగా ఇంద్ర ధనస్సులు ఏర్పడతాయి. గంభీరంగా దిగువకు జాలువారే జలపాతం.. పొగమంచు... ఇంద్రధనస్సులు.. ఉరుములతో చూపరులను మంత్రముగ్ధులను చేస్తుంది.చత్తీస్‌గఢ్, పొరుగు రాష్ట్రాలలోని ప్రధాన నగరాల నుండి ఇక్కడికి చేరుకోవచ్చు. సమీప పట్టణం జగదల్పూర్ జలపాతానికి గేట్‌వేలా ఉంటుంది.

‘ఉపాధి’ పథకంపై మోడీ బుల్డోజర్

- మండిపడిన కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 20: ఉపాధి హామీ పథకమైన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ తీవ్ర ఆక్షేపణ తెలిపారు. ఉపాధి హామీ పథకంపై బుల్డోజర్ నడిపారని ఆరోపించారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ స్థానే కేంద్రం తీసుకువచ్చిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ జీవికా మిషన్ (గ్రామీణ్) (వీబీజి రామ్ జి)బిల్లుకు ఇటీవల పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఆమోదం లభించింది. దీనిపై సోనియాగాంధీ తొలిసారి స్పందించారు. మహాత్మాగాంధీ పేరును ఉద్దేశపూర్వకంగానే కేంద్రం తొలగించిందని, ఉపాధి హామీ పథకం రూపురేఖలను కుట్రపూరితకంగా మార్చేసిందని తప్పుపట్టారు.



ఎలాంటి సంప్రదింపులు లేకుండా, భాగస్వాములతో సంప్రదింపులు జరపకుండా, విపక్షాలను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం ఈ మార్పులు తీసుకువచ్చిందని అన్నారు. ఈ మేరకు ఒక వీడియోను విడుదల చేశారు. '20 ఏళ్ల క్రితం మన్మోహన్ ప్రధానిగా ఉన్నప్పుడు ఎంజీఎన్ఆర్ఈజీఏను పార్లమెంటులో ఏకాభిప్రాయంతో ఆమోదించాం. ఈ పథకంతో పేదల ఉపాధికి చట్టపరమైన హక్కు కలిగింది. తద్వారా గ్రామీణ పంచాయతీలు బలపడడానికి దోహదపడింది. ఎంజీఎన్ఆర్ఈజీఏతో మహాత్మాగాంధీ కలస సాకారానికి పటిష్టమైన అడుగు వేశాం' అని సోనియాగాంధీ చెప్పారు. దేశంలోని కోట్లాది మంది రైతులు, కార్మికులు, భూమిల్లేని వారి ప్రయోజనాలపై మోదీ ప్రభుత్వం దాడి జరిపిందని, గత 11 ఏళ్లుగా గ్రామీణ పేదల ప్రయోజనాలను కేంద్రం నిర్లక్ష్యం చేసిందని సోనియాగాంధీ విమర్శించారు. ఎంజీఎన్ఆర్ఈజీఏపై ప్రభుత్వం ఇటీవల బుల్డోజర్ నడిపిందని, మహాత్మాగాంధీ పేరును తొలగించడమే కాకుండా హామీ పథకం రూపురేఖలనే మార్చేసిందని తప్పుపట్టారు. ఎవరినీ సంప్రదించకుండా, చర్చలు లేకుండా, విపక్షాలను ఖాతరు చేయకుండా కుట్రపూరితంగా ఈ మార్పులు చేసిందని అన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నల్లచట్టానికి వ్యతిరేకంగా పోరాడేందుకు దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని సోనియాగాంధీ తెలిపారు.

పిలిస్తే మేం ఇద్దరం వెళ్తాం

- ఢిల్లీ పర్యటనపై డీకే శివకుమార్ వ్యాఖ్యలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, బెంగళూరు, డిసెంబర్ 20: అధికార మార్పిడి అంశంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య అంతరం పెరుగుతోందంటూ ఊహాగానాలు వెలువడుతున్న నేపథ్యంలో డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చర్చల కోసం ఎప్పుడు పిలిచేది కాంగ్రెస్ అధిష్ఠానం తమ ఇద్దరికీ చెప్పిందని అన్నారు. అధిష్ఠానం ఎప్పుడు పిలిస్తే అప్పుడు ఇద్దరూ వెళ్తామని తెలిపారు. పార్టీ అధిష్ఠానాన్ని కలిసేందుకు ఇద్దరు నేతలు వెళ్లే అవకాశం ఉందా అని అడిగినప్పుడు డీకే నవ్వుతూ సమాధానమిచ్చారు. మీడియాకు తప్పనిసరిగా చెబుతానని, ఏదీ దాచిపెట్టనని అన్నారు. సరైన సమయంలో ఢిల్లీకి పిలుస్తామని అధిష్ఠానం పెద్దలు తమ ఇద్దరికి ఫోన్ చేసి చెప్పారని, పిలుపు ఎప్పుడు వస్తే అప్పుడు ఇద్దరూ వెళ్తామని తెలిపారు. ముఖ్యమంత్రి పదవిలో తాను కొనసాగుతానని అసెంబ్లీలో సిద్ధరామయ్య తాజాగా ప్రకటించిన నేపథ్యంలో డీకే ఈ వ్యాఖ్యలు చేశారు. ఉత్తర కర్ణాటక అభివృద్ధి పనుల అంశంపై సిద్ధరామయ్య శుక్రవారంనాడు అసెంబ్లీలో మాట్లాడుతూ, తన పదవీకాలం రెండున్నరేళ్లకే పరిమితమని తాను ఎప్పుడూ చెప్పలేదని అన్నారు. అధిష్ఠానం తనను ఐదేళ్లూ పదవిలో కొనసాగిస్తుందని అనుకుంటున్నట్టు చెప్పారు. 'మీ హయాంలో నార్త్ కర్ణాటకకు ఇచ్చిన హామీలు నెరవేరుతాయా?' అని బీజేపీ ఎమ్మెల్యే ఒకరు అడిగిన ప్రశ్నకు స్పందనగా సీఎం ఈ సమాధానం ఇచ్చారు. అధిష్ఠానం తన వైపే ఉందని అనుకుంటున్నానని, అయితే పార్టీ పెద్దలు ఏ నిర్ణయం తీసుకున్నా తాను కట్టుబడి ఉంటానని చెప్పారు. కాగా, పలువురు నాగసాధువులు శనివారంనాడు డీకే నివాసానికి వచ్చి ఆశీస్సులు ఇచ్చారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రిగా కూడా ఉన్న డీకే మంగళవారంనాడు పలువురు కేంద్ర మంత్రులను కలుసుకునేందుకు ఢిల్లీ వెళ్తున్నారు. నదుల అనుసంధానం విషయంలో కేంద్ర ప్రభుత్వ జలవనరుల శాఖ తమను పిలిచినట్టు డీకే తెలిపారు. మహదయి, కృష్ణ వాటర్ అవార్డ్, మేకేదాటు, ఎగువ భద్ర ప్రాజెక్టులకు సంబంధించి చర్చించనున్నట్టు చెప్పారు.

ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

నేడే అండర్ 19 ఆసియా కప్ ఫైనల్

- పాకిస్తాన్‌తో పోరుకు యువ ఇండియా రెడీ

అండర్ 19 ఆసియా కప్ 2025 టోర్నీలో ఆదివారం జరిగే ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో భారత్ తలపడనుంది. వరుస విజయాలతో జోరుమీదున్న యువ భారత్ ఈ తుది పోరుకు సిద్ధమైంది. ఆయుష్ మాత్రే నాయకత్వంలోని ఈ యువ టీమిండియా ఈ మ్యాచ్‌లో ఫేవరెట్ గా ఉంది. లీగ్ దశలో పాక్‌ను యువ భారత్ 90 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. ఈ క్రమంలో ఫైనల్ మరోసారి దాయాదికి తుది పోరుకు భారత్ సిద్ధమైంది. అలానే పాక్ కు షాకిచ్చి రికార్డు స్థాయిలో ఎనిమిదో టైటిల్‌ను పట్టేయాలని టీమిండియా పట్టుదలతో ఉంది. టోర్నీలో ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు ఆడిన భారత్.. రెండు మ్యాచ్‌ల్లో 400కుపైగా స్కోర్లు చేసింది. దీన్ని బట్టి యువ భారత జట్టు బ్యాటర్ల విధ్వంసం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. యంగ్ ప్లేయర్లు వైభవ్ సూర్యవంశీ, అభిజ్ఞాన్ కుందు సూపర్‌ఫామ్‌లో ఉన్నారు. యూఏఈపై వైభవ్ 95 బంతుల్లోనే 171 పరుగులు చేయగా, మలేసియాపై అభిజ్ఞాన్ డబుల్ సెంచరీ (209) బాదాడు. మిడిల్ ఆర్డర్‌లో ఆరోన్ జార్జి నిలకడగా రాణిస్తున్నాడు. ఫినిషింగ్ లో కాన్షిక్ చౌహాన్ అదరగొడుతున్నాడు. లీగ్ స్టేజ్‌లో పాక్‌పై 25 బంతుల్లో 38 పరుగులు చేసిన కెప్టెన్ ఆయుష్ మాత్రే నుంచి భారత్ భారీ ఇన్నింగ్స్ ఆశిస్తోంది. ఇక యంగ్ ఇండియా బౌలింగ్ విషయానికొస్తే.. పేసర్ దేపేశ్ దేవేంద్రన్ కీలకం కానున్నాడు. ఈ కుర్రాడు అదిరిపోయే బంతులు సంధిస్తూ ఆరంభంలోనే వికెట్లు తీస్తున్నాడు. ఇతను మలేసియాతో మ్యాచ్‌లో 22 పరుగులకే 5 వికెట్లు తీశాడు. ఈ టోర్నీలో ఇప్పటి వరకు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీశాడు. ఇతడికి తోడు దీపేశ్ కూడా విజృంభిస్తే భారత్‌కు తిరుగుండదు.

టీ20 ప్రపంచకప్‌కు ఇండియా టీమ్ రెడీ

స్వదేశంలో జరిగే టీ20 ప్రపంచకప్ టోర్నీకి భారత క్రికెట్ జట్టు సిద్ధమైంది. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగబోతున్న టీమ్‌ఇండియా పలు అనూహ్య మార్పులతో రాబోతున్నది. శనివారం బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో కార్యదర్శి దేవజిత్ సైకియా అధ్యక్షతన అజిత్ అగార్కర్ నేతృత్వంలో భేటీ అయిన సీనియర్ సెలెక్షన్ కమిటీ 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. సూర్యకుమార్‌యాదవ్ కెప్టెన్‌గా ఎంపిక చేస్తూ అంచనాలకు అందని నిర్ణయాలు తీసుకుంది. భారత ఆల్ ఫార్మాట్ కెప్టెన్‌గా భావిస్తున్న శుభ్‌మన్‌గిల్‌కు అనుకోని షాక్ ఎదురుకాగా, సూపర్ ఫామ్‌తో జార్ఖండ్‌ను తొలిసారి ముస్తాక్ అలీ టీ20 టోర్నీ విజేతగా నిలుపడంలో కీలకంగా వ్యవహరించిన ఇషాన్ కిషన్‌కు ఊహించని పిలుపు దక్కింది. సూపర్ ఫినిషర్‌గా అందరి మన్ననలు అందుకున్న యూపీ హార్డ్ హిట్టర్ రింకూసింగ్ పట్ల సెలెక్టర్లు నమ్మకాన్ని ఉంచారు. మరోవైపు వికెట్ కీపర్, బ్యాటర్‌గా రాణిస్తున్న జితేశ్ శర్మకు నిరాశ ఎదురుకాగా, సూపర్‌ఫామ్‌తో అలరిస్తున్న హైదరాబాదీ డాషింగ్ బ్యాటర్ తిలక్‌వర్మ తొలిసారి టీ20 ప్రపంచకప్‌నకు ఎంపికయ్యాడు. మొత్తంగా గిల్‌కు మొండిచేయి చూపించిన సెలెక్టర్లు ప్యాకెట్ డైనమైట్‌గా పిలుచుకునే ఇషాన్ కిషన్‌ను వికెట్‌కీపర్, టాపార్డర్ బ్యాటర్‌గా జట్టులోకి తీసుకున్నారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న సెలెక్టర్లు టాపార్డర్‌లో వికెట్‌కీపర్, బ్యాటర్ అవసరాన్ని గమనించి సంజూ శాంసన్‌తో పాటు ఇషాన్ కిషన్‌ను జట్టులోకి తీసుకున్నారు. ఫిట్‌నెస్, గాయాల కారణంగా ఈ ఏడాది టీమ్‌ఇండియాకు దూరంగా ఉన్న ఇషాన్ కిషన్.. ఇటీవల ముగిసిన ముస్తాక్ అలీ టోర్నీలో సత్తాచాటాడు. సూపర్‌ఫామ్ కనబరుస్తూ జార్ఖండ్‌ను విజేతగా నిలుపడంలో కీలక భూమిక పోషించాడు. ఎక్కడ కోల్పోయాడో అక్కడే సాధించుకోవాలన్న పట్టుదలతో కసిగా ఆడి తిరిగి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ముస్తాక్ అలీ ఫైనల్లో ఇషాన్ చేసిన మెరుపు సెంచరీ..సెలెక్టర్ల దృష్టిని బాగా ఆకర్షించింది. టీ20 ఫార్మాట్‌లో టీమ్‌ఇండియా తరఫున నిలకడగా రాణిస్తున్న హైదరాబాదీ తిలక్‌వర్మ జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు.

జట్టు : సూర్యకుమార్(కెప్టెన్), అభిషేక్‌శర్మ, తిలక్‌వర్మ, హార్దిక్‌పాండ్యా, శివమ్‌దూబే, అక్షర్‌పటేల్, కుల్దీప్‌యాదవ్, బుమ్రా, అర్ష్‌దీప్‌సింగ్, హర్షిత్‌రానా, శాంసన్, సుందర్, వరుణ్ చక్రవర్తి, ఇషాన్ కిషణ్, రింకూసింగ్

గెలుపు బాటలో ఆసీస్

యాషెస్ సిరీస్‌లో భాగంగా అడిలైడ్ వేదికగా మూడో టెస్టులో ఆస్ట్రేలియాఇంగ్లండ్ తలపడుతున్నాయి. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 63 ఓవర్లకు ఆరు వికెట్లు నష్టపోయి 207 పరుగులు చేసింది. ఇంగ్లండ్ గెలుపుకి ఇంకా 228 పరుగులు కావాలి. 435 పరుగుల విజయ లక్ష్యంతో ఛేదనకు దిగిన ఇంగ్లండ్.. రెండో ఇన్నింగ్స్‌లో తడబడింది. ఆసీస్ బౌలర్ల ధాటికి ఇంగ్లండ్ బ్యాటర్లు పెవిలియన్‌కి క్యూ కట్టారు. ఆ టీమ్ గెలవాలంటే ఏదైనా అద్భుతం జరిగితే తప్పా అసాధ్యం. ఇంగ్లండ్ బ్యాటర్లలో క్రాలీ(85) రాణించాడు. రూట్ (39), బ్రూక్(30) పర్వాలేదనిపించారు. డకెట్(4), ఓలీ పోప్(17), స్టోక్స్(5), జెమీ స్మిత్(2), విల్ జాక్స్(11) తీవ్రంగా నిరాశపర్చారు. ఆసీస్ బౌలర్లో ప్యాట్ కమిన్స్, నాథన్ లైయన్ తలో మూడు వికెట్లు పడగొట్టి.. ఇంగ్లండ్ పతనాన్ని శాసించారు. అంతకుముందు 271/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన ఆసీస్ 349 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (170), వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (72) రాణించారు. జోష్ ఇంగ్లిస్ (10), పాట్ కమిన్స్ (6), నాథన్ లైయన్ (0), స్కాట్ బోల్యాండ్ (1) స్వల్ప పరుగులకే వెనుదిరిగారు. మిచెల్ స్టార్క్ (7*) నాటౌట్‌గా నిలిచాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్‌టంగ్ 4, బ్రైడన్ కార్స్ 3, జోఫ్రా ఆర్చర్, విల్‌జాక్స్, బెన్‌స్టోక్స్ తలో వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు.

సాత్విక్ జోడీ నిష్క్రమణ

ప్రతిష్టాత్మక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీలో భారత స్టార్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి పోరాటం ముగిసింది. మెగాటోర్నీలో సెమీఫైనల్ చేరిన తొలి భారత జోడీగా కొత్త చరిత్ర లిఖించిన సాత్విక్, చిరాగ్ అదే పోరాటాన్ని కొనసాగించలేకపోయారు. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీస్‌లో సాత్విక్, చిరాగ్ ద్వయం 2110, 1721, 1321తో చైనా జంట లియాంగ్ వీ కెంగ్, వాంగ్ చాంగ్ చేతిలో ఓటమిపాలైంది. గంట పాటు హోరాహోరీగా సాగిన పోరులో ఈ యువ షట్లర్లు పోరాడి ఓడారు. తొలి గేమ్‌ను 2110తో దక్కించుకుని ఆధిక్యం కనబరిచిన సాత్విక్, చిరాగ్ అదే దూకుడు కొనసాగించలేకపోయారు. ఫలితంగా మెగాటోర్నీలో ఫైనల్ చేరుకునే అవకాశాన్ని కోల్పోవాల్సి వచ్చింది.

భయపెడుతున్న 'ఈషా' వార్నింగ్ వీడియో..

ఇటీవల లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి లాంటి సూపర్‌హిట్ కల్ట్ చిత్రాలను ప్రేక్షకులకు అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటి ద్వయం తాజాగా 'ఈషా' పేరుతో ఓ హారర్ థ్రిల్లర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకరాబోతున్నారు. వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్‌గా ఈ చిత్రాన్నిడిసెంబరు 25న చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల రాజు వెడ్స్ రాంబాయి చిత్రంతో సూపర్‌హిట్ కొట్టిన అఖిల్‌రాజ్ తో పాటు త్రిగుణ్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో హెబ్బాపటేల్ కథానాయిక. సిరి హనుమంతు, బబ్లూ, పృథ్వీరాజ్ ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని హెచ్‌వీఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది తెలిసిందే.. ముఖ్యంగా ఈ చిత్రంలో ఉండే సడన్ ట్విస్ట్‌లను, హారర్ సీన్స్‌ను హార్ట్‌వీక్‌గా ఉన్న వాళ్లు చూడకూడదని మేకర్స్ నుంచి వార్నింగ్ కూడా వచ్చిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఈ చిత్ర నిర్మాతలు 'ఈషా' వార్నింగ్ పేరిట శనివారం మరో వీడియోను విడుదల చేశారు.

మెగా స్టిల్స్

సంక్రాంతి ఎంటర్‌టైనర్ 'మన శంకరవర ప్రసాద్ గారు' చిత్రానికి సంబంధించి మేకర్స్ విడుదల రిలీజ్ చేసిన మెగాస్టార్ చిరంజీవి ఎక్స్‌క్లూజివ్ స్టిల్స్ సోషల్ మీడియాలో, అభిమాన వర్గాల్లోనూ మ్యాసీవ్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ అద్భుతమైన స్టిల్స్‌లో చిరంజీవి స్టైలిష్‌గా, యూత్‌ఫుల్‌గా, గొప్ప చారిస్మాతో కనిపిస్తూ తన టైమ్‌లెస్ అప్పీల్, మ్యాజికల్ స్క్రీన్ ప్రెజెన్స్‌ను మరోసారి చాటారు. ఆయన వింటేజ్ చార్మ్, నేచురల్ గ్రేస్ ప్రేక్షకుల మనసులని దోచుకుంది. ఇప్పటికే విడుదలైన తొలి రెండు పాటలు "మీసాల పిల్ల", "శశిరేఖ" చార్ట్‌బస్టర్‌లుగా నిలిచి, భారీ వ్యూస్‌తో పాటు విశేష స్పందనను సొంతం చేసుకున్నాయి. డిసెంబర్ చివరి వారంలో విడుదల కానున్న మూడో పాటతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరగనున్నాయి.హిట్ మిషన్ డైరెక్టర్ అనిల్ రావిపూడి, అభిమానులు ఎంతో కాలంగా చూడాలని కోరుకుంటున్న క్లాసిక్, నాస్టాల్జిక్ అవతార్‌లో మెగాస్టార్ చిరంజీవిని ఈ చిత్రంలో ప్రజెంట్ చేస్తున్నారు. చాలా గ్యాప్ తర్వాత చిరంజీవి పూర్తిస్థాయి వినోదాత్మక పాత్రలో కనిపించనుండటం అభిమానులకు ప్రత్యేక ఆనందాన్ని అందించనుంది.

ప్రారంభమైన 'బొమ్మ హిట్'

చైల్డ్ ఆర్టిస్టుగా పలు సూపర్ హిట్ చిత్రాల్లో నటించిన అభినవ్ మణికంఠ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "బొమ్మ హిట్". ఈ చిత్రాన్ని అంజనీపుత్ర ఫిలింస్ బ్యానర్ లో ప్రొడక్షన్ నెంబర్ 1గా గుర్రాల సంధ్యారాణి నిర్మిస్తున్నారు. బొమ్మ హిట్ చిత్రంతో రాజేష్ గద్దం దర్శకుడిగా పరిచయమవుతున్నారు. పూజా యడం హీరోయిన్ గా నటిస్తోంది. కాగా ఈ చిత్రం నేడు పూజా కార్యక్రమాలతో హైదరా బాద్ లో ప్రారంభమైంది. అనంతరం మూవీ హైలైట్స్ ను ఈ రోజు ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో చిత్ర బృందం తెలిపారు. ఈ కార్యక్రమంలో హీరో అభినవ్ మణికంఠ మాట్లాడుతూ ఇది హీరోగా నాకు రెండో సినిమా. ఫస్ట్ ఫిలిం వర్క్స్ జరుగుతున్నాయి. నేను నటించిన ర్యాంబో ఇన్ లవ్ వెబ్ సిరీస్ హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ అవుతోంది. బొమ్మ హిట్ సినిమా మంచి ఎంటర్ టైన్ మెంట్ తో సిచ్యువేషనల్ కామెడీతో వినోదాన్ని ఇస్తుంది. ఈ చిత్రంలో ఫన్ తో పాటు మంచి ఎమోషన్ కూడా ఉంది. ఈ మధ్య ఎంటర్ టైన్ మెంట్ మూవీస్ ను ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. మా బొమ్మ హిట్ సినిమాను కూడా హిట్ చేస్తారని కోరుకుంటున్నా. అన్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200